SRI GAYATRI AYURVEDIC MULTI SPECIALITY CENTRE
GIAYS
Traditional Cure For Toughest Diseases
శ్రీ గాయత్రి ఆయుర్వేదిక్ మల్టీస్పెషాలిటీ సెంటర్

D.No. 58-15-124, Santhinagar, NAD 'x' Road, Visakhapatnam-530016. Ph : 9247011553
Email: srigayatriayurvedavskp@gmail.com

APTEL RNI NO: 62061/2015

# వార్తావళి

తెలుగు దినపత్రిక

వివాహ మరియు గృహ సంబంధమైన
శుభ ముహూర్తములు మరియు
పుట్టిన తేది, సమయం, పుట్టిన ప్రాంతం
నక్షత్రములు బట్టి జాతకములు వ్రాయబడును
బులుసు వెంకట సుబ్రహ్మణ్యం
M.A. Astrology
#135/B,Sector-3, Ukkunagaram, Vizag-32
e*mail : bulusu333@gmail.com
Ph : 70320 34001, 85001 59006

విశాఖపట్నం : శనివారం 22 ఆగస్ట్ 2020 ఎడిటర్ : బులుసు వెంకట సుబ్రహ్మణ్యం VAARTAVALI TELUGU DAILY పేజీలు : 8 రూ. 1.00 సంపుటి 5 సంచిక 187

## శ్రీశైలంలో అగ్నిప్రమాదం

### ఆరు మృతదేహాలు వెలికితీత

### కొనసాగుతున్న సహాయక చర్యలు



**శ్రీశైలం:** తెలంగాణ పరిధిలోని శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో మృతుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటి వరకు ఒక మృతదేహం లభ్యం కాగా.. తాజాగా మరో ఐదు మృతదేహాల్ని సహాయక సిబ్బంది వెలికి తీశారు. మృతుల్లో ఏఈ మోహన్‌కుమార్, ఏఈ ఉజ్మ ఫాతిమా ఉన్నట్లు గుర్తించారు. మరో ఏఈ సుందర్ కూడా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 9 మంది చిక్కుకుపోగా.. ఇప్పటి వరకు మొత్తం ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మిగతావారి ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. సహాయక చర్యల్లో సీఐఎస్ఎఫ్, ప్రత్యేక బృందాలు పాల్గొన్నాయి. దట్టమైన పొగలు అలముకోవడంతో పలువురు సీఐఎస్ఎఫ్ సిబ్బంది అస్వస్థతకు గురవుతున్నారు. జల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలో గురువారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. తొలుత ప్యానల్ బోర్డులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి జలవిద్యుత్ కేంద్రం మొత్తం వ్యాపించాయి. ప్రమాదం జరిగిన సమయంలో విద్యుత్ కేంద్రంలో 30 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 15 మంది సొరంగ మార్గం ద్వారా బయటపడగా.. సహాయక సిబ్బంది మరో ఆరుగురిని రక్షించారు. మిగిలిన తొమ్మిది మంది లోపలే చిక్కుకు పోయారు. విద్యుత్ కేంద్రంలో చిక్కుకుపోయిన సిబ్బంది ఎలా ఉన్నారోనని వారి కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఏ క్షణం ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని ఉద్యోగుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తెలంగాణ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నాగర్ కర్నూల్ కలెక్టర్ శర్మన్, ట్రాన్స్‌కో సీఈ రమేశ్ తదితరులు సహాయక చర్యలను దగ్గరుడి పర్యవేక్షిస్తున్నారు.


## రాష్ట్రంలో కోవిడ్ ఆసుపత్రులు పెంపు

**అమరావతి, వార్తావళి, ఆగస్ట్ 21 :** కోవిడ్-19 పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ, కోవిడ్-19 ఆస్పత్రుల సంఖ్యను 138 నుంచి 287కు పెంచినట్లు తెలిపారు. స్పెషలిస్టులను, డాక్టర్లను వీలైనంత త్వరగా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కోవిడ్-19 కార్యక్రమాల్లో తాత్కాలికంగా నియమిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి జీతాలు పెంచాలని సీఎం జగన్ ఆదేశించారు. కోవిడ్ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు, వైద్యులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు లోపాలను, సిబ్బంది కొరతను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అందిస్తున్న సేవలకు అనుగుణంగా కోవిడ్ ఆస్పత్రులకు రేటింగ్ ఇవ్వాలన్నారు. ప్రస్తుతం ఉన్న 287 ఆస్పత్రుల్లో అన్ని రకాల సదుపాయాలు, సరైన సంఖ్యలో వైద్యులు, సిబ్బంది సంతృప్త స్థాయిలో ఉండాలని, నిరంతరం ఆస్పత్రుల్లో ప్రమాణాలను పర్యవేక్షించాలని చెప్పారు. కాల్ సెంటర్‌లతో పాటు ఆస్పత్రుల్లోని హెల్ప్ డెస్క్‌లు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఇంకా సీఎం జగన్ మాట్లాడుతూ,



' చికిత్స తీసుకుంటున్నవారికి మంచి భోజనం అందించాలి, హోంక్వారంటైన్‌లో ఉన్నవారికి సేవలు సక్రమంగా అందాలి. మందులు ఇవ్వడం, చికిత్స అందించడం, వారి సందేహాలకు ఎప్పటికప్పుడు సమాధానాలు ఇచ్చే వ్యవస్థ సక్రమంగా ఉండాలి. ఆరోగ్యశ్రీ కింద వచ్చే పేషెంట్లకు అత్యుత్తమ సేవలు అందాలి. మనం ఆస్పత్రులకు వెళ్లినప్పుడు ఎలాంటి సేవలు కోరుకుంటామో ఆ విధానాలు కచ్చితంగా అమలు కావాలి. రిఫరల్ ప్రోటోకాల్ చాలా స్పష్టంగా ఉండాలి. విలేజ్, వార్డు క్లినిక్స్ నుంచి ఈ ప్రోటోకాల్ అమలు జరగాలి. ఆరోగ్యశ్రీ సేవల సమాచారం తెలుసుకునేందకు, ఏవైనా ఫిర్యాదులు చేసేందుకు ఒక కాల్‌సెంటర్ ఉండాలి. ఈనంబర్‌ను అన్ని ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లో బోర్డుపై ఉంచాలి. పేషెంట్‌ను ట్రీట్‌చేయకుండానే అవసరంలేకుండా రిఫర్ చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామనే విషయాన్ని గట్టిగా చెప్పాలి. ఆరోగ్య ఆసరా పనితీరును కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. డెలివరీ అవగానే తల్లికి డబ్బు ఇచ్చే కార్యక్రమం అమలు ఎలా జరుగుతుందో పరిశీలించాలి. ఆస్పత్రి నుంచి తల్లి, బిడ్డ డిశ్చార్జి అవుతున్నప్పుడే డబ్బులు వారి అక్కౌంట్లో పడాలి' అని సీఎం జగన్ ఆదేశించారు.

## డిసెంబరు 3 నాటికి కరోనా కనుమరుగవుతుంది!



**న్యూఢిల్లీ:** దేశంలో డిసెంబరు 3 నాటికి కరోనా వైరస్ కనుమరుగైపోయే అవకాశాలు ఉన్నట్లు "టైమ్ ఫ్యాక్ట్స్- ఇండియా ఔట్‌బ్రేక్ రిపోర్టు" అంచనా వేసింది. సెప్టెంబరు తొలివారంలో కోవిడ్-19 పాజిటివ్ కేసుల సంఖ్య పతాక స్థాయిని చేరతాయని, ఆ తర్వాత క్రమక్రమంగా కరోనా బాధితుల సంఖ్య తగ్గిపోతుందని నివేదికలో వెల్లడించింది. కరోనా విజృంభిస్తున్న తొలినాళ్లలో హాట్‌స్పాట్లుగా ఉన్న ఢిల్లీ, ముంబై, చెన్నైలలో వైరస్ వ్యాప్తి తగ్గుముఖం పట్టడాన్ని సానుకూల అంశంగా పేర్కొంది. వాణిజ్య రాజధాని ముంబైలో ఇప్పటికే కరోనా కేసుల సంఖ్య శిఖర స్థాయికి చేరుకుందని.. ప్రస్తుతం నమోదవుతున్న కేసులను గతంతో పోల్చి చూసినట్లయితే నవంబరు రెండో వారం నాటికి అక్కడ వైరస్ పూర్తిగా కనుమరుగయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇక చెన్నైలో అక్టోబరు చివరినాటికి, ఢిల్లీలో నవంబరు మొదటి వారం, బెంగళూరులో నవంబరు రెండో వారంలోగా ఇలాంటి సానుకూల ఫలితాలే చూడవచ్చని అంచనా వేసింది. దేశంలోని ప్రధాన నగరాల్లో గత కొన్ని వారాలుగా కరోనా కేసుల సంఖ్య తగ్గముఖం పట్టడం శుభపరిణామమని, విశ్వసనీయ ప్రభుత్వ వర్గాల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను విడుదల చేసినట్లు పేర్కొంది. ఇక ఇండోర్, థానె, సూరత్, జైపూర్, నాశిక్, తిరువనంతపురం వంటి టైర్-2, టైర్-3 సిటీల్లో ఆగష్టులో కోవిడ్ కేసుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, అయితే నవంబరు నాటికి ఇక్కడ ఈ ప్రాంతాల్లో కూడా కరోనా తగ్గుముఖం పడుతుందని అంచనా వేసింది. అదే విధంగా కరోనా వ్యాప్తిలో కీలకమైన రీప్రొడకక్షన్ రేటు(ఆర్‌ఓ- కరోనా సోకిన వ్యక్తి నుంచి సగటున ఎంతమందికి ఇతర వ్యక్తులకు వైరస్ సంక్రమించిందన్న విషయాన్ని ఇది తెలియజేస్తుంది)లో తగ్గుదల నమోదవుతోందని వెల్లడించింది. ఆగష్టు 15 నాటికి మహారాష్ట్ర, తెలంగాణలో ఇది 1.24గా నమోదు కాగా.. రాజస్తాన్, ఢిల్లీలో ఆర్ వాల్యూ 1.06, 1.10గా ఉందని పేర్కొంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో నవంబర్ నాటికి, తెలంగాణలో అక్టోబర్ 17 నాటికి కరోనా పూర్తిగా అంతం కావొచ్చని అంచనా వేసింది. జనాభా, కరోనా నిర్ధారణ పరీక్షలు, కంటైన్మెంట్ జోన్ల తదితర అంశాల ఆధారంగా కరోనా తీవ్రతను అంచనా వేశామని, అయితే తాజా గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే ఈ వివరాల్లో కాస్త మార్పులు చేర్పులు ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది. ఇక భారత్‌లో గురువారం 68,898 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కరోనా బాధితుల సంఖ్య 29,05,823 కు చేరింది. గడిచిన 24 గంటల్లో 983 మంది కోవిడ్‌తో మృతి చెందడంతో మొత్తం కరోనా మరణాల సంఖ్య 54,849 కు చేరింది. ఇక దేశంలో మహమ్మారి కరోనా నుంచి కోలుకున్నవారి మొత్తం సంఖ్య 21,58,946గా ఉంది.

## ఈ టాయిలెట్స్ బహు విచిత్రం!




జిహ్వాకో రుచి.. పుర్రెకో బుద్ధి అని పెద్దలు అంటుంటారు. ఎవరి ఆలోచనలు వారికుంటాయి. అయితే అవి బయటపడినప్పుడే వారి సృజన ఎలాంటిదో తెలుస్తుంది. పై ఫొటో కనిపిస్తున్న ఆ టాయిలెట్ కూడా ఒకరి సృజనాత్మకతకు రూపం. దీని గురించి తెలుసుకున్న తర్వాత 'ముందు హవ్వా.. ఇదేం దరిద్రపు టాయిలెట్' అంటారు. ఆ తర్వాత 'భలే ఉందే' అని మెచ్చుకుంటారు. జపాన్.. సృజనాత్మకత, పరిశుభ్రతకు పెట్టింది పేరు. ఏం చేసినా కొత్తగా.. విభిన్నంగా చేయడానికి ప్రయత్నిస్తుంటారు. అలాంటి యత్నమే ఇది. ఇటీవల నిప్పాన్ ఫౌండేషన్ అనే సంస్థ పబ్లిక్ టాయిలెట్స్ వల్ల కలిగే ఇబ్బందులను గమనించింది. పబ్లిక్ టాయిలెట్స్ రూమ్‌లోకి వెళ్లాలంటే పరిశుభ్రంగా ఉందో లేదో అని అనుమానం ఉంటుంది. అలాగే అక్కడికి వెళ్లాక లోపల ఎవరైనా ఉన్నారో లేదో తెలుసుకోవడం మరింత ఇబ్బందిగా అనిపిస్తుంటుంది. వీటికి పరిష్కారం చూపుతూ నిప్పాన్ ఫౌండేషన్ టోక్యోలోని షిబుయా ప్రాంతంలో 17 చోట్ల వినూత్న టాయిలెట్స్ నిర్మించ తలపెట్టింది. స్థానిక ప్రభుత్వం సహకారంతో 16 మంది ఆర్కిటెక్చర్లకు ఈ టాయిలెట్స్ డిజైన్ పని అప్పగించింది. ఇటీవల నాలుగు డిజైన్లు ఖరారై.. పలు చోట్ల ఈ టాయిలెట్స్‌ను నిర్మించేశారు. వాటిలో అందరినీ ఆకట్టుకుంటున్న టాయిలెట్.. ఆర్కిటెక్చర్ షిగెరు బాన్ రూపొందించిన 'ట్రాన్స్‌పరెంట్ టాయిలెట్'. ట్రాన్స్‌పరెంట్ టాయిలెట్.. పేరుతోనే దీన్ని ఎలా నిర్మించారో అర్థమైపోతుంది. నిజమే ఈ టాయిలెట్ గోడల స్థానంలో ఆధునిక టెక్నాలజీతో తయారు చేసిన రంగుల అద్దాలను అమర్చారు. ఇవి పారదర్శకంగా ఉంటాయి. బయట నుంచి లోపలి దృశ్యాలు.. లోపలి నుంచి బయట దృశ్యాలు కనిపిస్తాయి. అయితే ఎవరైనా లోపలికి వెళ్లి లాక్ వేయగానే ట్రాన్స్‌పరెంట్ అద్దాలు కాస్త పూర్తి రంగులోకి మారిపోతాయి. దీని వల్ల బయట వాళ్లకు లోపల దృశ్యాలు కనిపించవు. ఎప్పుడైతే అన్‌లాక్ చేస్తారో అప్పుడు మళ్లీ అద్దాలు పారదర్శకంగా మారతాయి. అంటే అద్దం పూర్తి రంగులోకి మారితే టాయిలెట్ రూమ్‌లో ఎవరో ఉన్నారని అర్థం. పారదర్శకంగా ఉంటే టాయిలెట్స్ ఎంత శుభ్రంగా ఉన్నాయో బయట నుంచే చూడొచ్చు. నిప్పాన్ ఫౌండేషన్ పేర్కొన్న రెండు సమస్యలకు ఈ టాయిలెట్స్ పరిష్కారం చూపినట్టే ఉంది కదా! వీటిని ప్రస్తుతం రెండు కమ్యూనిటీ పార్కుల్లో ఏర్పాటు చేశారు.

## ఆన్‌లైన్ జాబ్‌లకు డబ్బు చెల్లించొద్దు..




**విజయవాడ, వార్తావళి, ఆగస్ట్ 21 :** రాష్ట్రంలోని బాలలు, మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ, సీఐడీ విభాగం సంయుక్తంగా రూపొందించిన 'ఈ- రక్షాబంధన్' కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సైబర్ నేరగాళ్ల నుంచి మహిళలను రక్షించేందుకు అవగహన కల్పించేలా ఆన్‌లైన్ శిక్షణా తరుగతులను ప్రభుత్వం చేపడుతోంది. దీనిలో భాగంగానే విజయవాడలో శుక్రవారం 18వ రోజు 'ఈ రక్షా బంధన్' శిక్షణ తరగతులు జరిగాయి. పోలీస్ శాఖ, సీఐడీ విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ వెబ్‌నార్‌లో వ్యక్తిగత సమాచార దోపిడి, ఉద్యోగాల మోసాలు వంటి అంశాలపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా వెబ్‌నార్‌లో పాల్గొన్న సైబర్ నిపుణులు విమల్ ఆదిత్య, నందీశ్వర్ పలు కీలక సూచనలు చేశారు. వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని, అలాగే సోషల్ మీడియాలోనూ షేర్ చేయవద్దని సలహాఇచ్చారు. ఆన్‌లైన్ జాబ్ మోసగాళ్లకు ఎలాంటి సమాచారం లేకుండా డబ్బు చెల్లించవద్దని నిరుద్యోగులకు సూచించారు. అలాగే వ్యక్తిగత సమాచారం దోపిడికి గురైతే దానిని ఎలా కనుగోవచ్చు అంశపై సుదీర్ఘంగా చర్చించారు. ?సైబర్ స్థలంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్త వైఖరిని పెంపొందించుకోవాలన్నారు. రెస్టారెంట్లు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లలో సర్వే ఫారాలను నింపడం ద్వారా సమాచారం దోపిడి జరుగుతుందన్న అనుమానంపై సైతం సలహాలు ఇచ్చారు. అలాగే ఆన్‌లైన్ ఉద్యోగ మోసాలు ,పెళ్ళి సంబంధాల మోసాల నుంచి రక్షణ పొందడానికి భద్రతా చిట్కాలను సైతం సైబర? నిపుణులు చర్చించారు. కాగా తోబుట్టువుల మధ్య అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పురస్కరించుకుని సైబర్ నేరగాళ్ల నుంచి మహిళలను రక్షించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ-రక్షాబంధన్‌లో భాగంగా.. యూట్యూబ్ ఛానల్ ద్వారా స్కూళ్లు, కాలేజీలు, వర్కింగ్ ఉమెన్‌కు సైబర్ సెక్యూరిటీ నిపుణులతో నెలరోజులపాటు ఆన్‌లైన్‌లో శిక్షణ నిర్వహిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా షార్ట్ ఫిలిమ్స్, యానిమేషన్స్, రీడింగ్ మెటీరియల్ ద్వారా ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వహకులు పేర్కొన్నారు.

## వినాయక చవితి శుభాకాంక్షలు: సీఎం జగన్



**అమరావతి, వార్తావళి, ఆగస్ట్ 21 :** వినాయక చవితి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియ జేశారు. ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సు లతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో, అభివృద్ధిలో ముందడుగు వేయాలని అభిలషించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఎదురవుతున్న ఆటంకాలు, విఘ్నాలన్నీ తొలగిపోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## ఆ ఆయుర్వేద వైద్యుడిపై సుప్రీంకోర్టు ఆగ్రహం

### రూ.10 వేల జరిమానా విధింపు



**ఢిల్లీ:** కరోనా వైరస్‌కు మందు కనిపెట్టానని, తాను తయారుచేసిన మందును వినియోగించేలా తీర్పు ఇవ్వాలంటూ పిటిషన్ వేసిన ఓ ఆయుర్వేద వైద్యుడిపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అనాధారిత పిటిషన్ వేసిన అతడికి రూ.10 వేల జరిమానా విధించింది. ఆయుర్వేద వైద్యంలో బ్యాచిలర్ డిగ్రీ చేసిన హరియాణాకు చెందిన ఓం ప్రకాశ్ వేద్ జ్ఞాన్‌తారా తాను కొవిడ్‌కు మందు తయారు చేశానని సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశాడు. భారత ప్రభుత్వం, ఆరోగ్య శాఖ, ఇతరులు ఆ మందును వినియోగించేలా తీర్పు ఇవ్వాలని ఉన్నత న్యాయస్థానాన్ని కోరాడు. తాను రూపొందించిన దేశీయ మందు ప్రజలను ప్రాణాంతక వ్యాధి నుంచి కాపాడుతుందని తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. అయితే ఎలాంటి ఆధారాలు లేకుండా దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఈ తరహా పిల్‌ను వేయడాన్ని జస్టిస్ సంజయ్ కే కౌల్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. అనాధారిత పిటిషన్లు వేయడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రచారం కోసమే కొందరు ఇలాంటి పనులు చేస్తారని మండిపడింది. పిటిషన్‌ను కొట్టివేస్తూ కోర్టు వైద్యుడికి రూ.10 వేల జరిమానా విధించింది. నాలుగు వారాల్లోపు ఆ జరిమానా కట్టాల్సిందిగా ఆదేశించింది.

# ఆయుధ అన్వేషణలో భారత్-ఆధిపత్య పరుగులో చైనా..



భారత్, చైనాల మధ్య తూర్పు లద్దాఖ్‌లో కొనసాగుతున్న ప్రతిష్టంభన ఇరు దేశాలూ భారీ స్థాయిలో సైన్యాలను, ఆయుధ వ్యవస్థలను మోహరించుకునే వరకూ వెళ్లింది. ప్రస్తుతానికి నివురుగప్పిన నిప్పులా ఉన్న పరిస్థితులు రానున్న రోజుల్లో మరింత ఉద్రిక్తంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. సంక్లిష్టమైన వాతావరణం కలిగి ఉండే మంచు పర్వతాల్లో ప్రపంచంలోనే అతిపెద్ద దేశాల్లో రెండైన భారత్, చైనా ఇదివరకు ఎన్నడూ లేనంత భీకరంగా ముఖాముఖి తలపడేందుకు సిద్ధమవుతున్నాయి. సరిహద్దుల విషయంలో తమ తమ వైఖరులపై అవి గట్టిగా నిలబడటం.. రానున్న శీతాకాలంలో అత్యంత తీవ్రమైన చలిని సైతం ఎదుర్కొనేందుకు వెనుకాడబోవన్న సంకేతాలనిస్తోంది. దీనిలో భాగంగానే అత్యంత ఎత్తైన శీతల ప్రాంతాల్లో శత్రువును గట్టిగా తిప్పికొట్టేందుకు అవసరమైన ఆయుధాలను, పరికరాలను సమకూర్చుకొనే యత్నాల్లో భారత సైన్యం నిమగ్నమైంది. "ఆయుధాలు, మందుగుండు సామగ్రి, సెన్సర్లుపరంగా ఉన్న నిర్వహణపరమైన లోపాలను గుర్తించాం. సైనిక ఉన్నతాధికారుల పర్యవేక్షణలో అత్యవసరమైన సైనిక సంపత్తి సేకరణను ముమ్మరం చేశాం. భారీ స్థాయిలో వాటిని కొనుగోలు చేయబోతున్నాం"అని ఓ సైనికాధికారి 'ఈటీవీ భారత్'కు తెలిపారు. "ఆయుధాల కొనుగోలుకు సంబంధించి గతంలో ఏడాదికి 12 నుంచి 15 ఒప్పందాలు మాత్రమే జరిగేవి. చైనాతో సరిహద్దు ఘర్షణలు ప్రారంభమయ్యాక వాటి సంఖ్య 100 దాటింది. అదీ కూడా ఈ ఆర్థిక సంవత్సరంలోనే అమలులోకి వస్తాయి" అని వివరించారు. రష్యాలో జరిగే ఆయుధ ప్రదర్శనను సందర్శించటానికి రక్షణ శాఖ కార్యదర్శి వెళ్లే అవకాశం ఉంది. అక్కడ జరిగే భేటీల్లో చాలా కాలంగా చర్చల్లో నానుతున్న ఏకే-203 రైఫిళ్ల సంయుక్త తయారీ సహా పలు ఒప్పందాలు ఖరారు కావచ్చని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. భవిష్యత్తు యుద్ధాలు చాలా సంక్లిష్టంగా, అత్యంత తీవ్రంగా, అనూహ్యంగా ఉంటాయి కనుక తగిన సన్నద్ధతలు అవసరమని భారత సాయుధ దళాల సంయుక్త వ్యూహ పత్రం (2017) పేర్కొంది.

**జాతీయతా వాదం**

చైనా, భారత్‌లోనూ దృఢమైన నాయకత్వాలు అధికారంలో ఉండటంతో పాటు జాతీయతావాదం ప్రబలమైన అంశంగా మారిపోయింది. నేటి ప్రపంచంలో అగ్రదేశాల సరసన స్థానం దక్కించుకోవాలని భారత్ కోరుకుంటోంది. 2049నాటికి అత్యంత శక్తిమంతమైన దేశంగా అమెరికాను సైతం మించిపోయి ప్రపంచాధిపత్యం వహించాలన్న వ్యూహంతో చైనా ఉంది. తన లక్ష్య సాధనకు అవరోధంగా నిలిచే సవాళ్లన్నిటినీ అధిగమించేందుకు డ్రాగన్ ఉద్యుక్తమవుతోంది.

**కరోనా కల్లోలంలో అమెరికా**

కరోనా వైరస్ మహమ్మారి వ్యాప్తిని అడ్డుకోవటంలో చైనా, భారత్‌లు రెండూ తమ బలహీనతలను బహిర్గతం చేసుకున్నాయి. అత్యధిక మరణాలు సంభవించిన దేశంగా అమెరికా నిలిచింది. అయితే, తూర్పు లద్దాఖ్ వివాదం.. ప్రజల దృష్టిని కరోనా నుంచి మళ్లించేలా చేయటానికి ఆయా దేశాలకు ఉపయోగపడి ఉండవచ్చు. కరోనా విజృంభణతో పాటు జాతివివక్ష వివాదం అమెరికాను చుట్టుముట్టి మరింత బలహీనపరిచిన పరిస్థితులు చైనాకు అనుకూలించేవే. ఇదే సమయంలో భారత్‌ను అడ్డుపెట్టుకొని చైనాను దెబ్బతీయాలని అమెరికా ఎదురుచూస్తోంది.

## నిలకడగానే ప్రణబ్ ముఖర్జీ ఆరోగ్యం!



**దిల్లీ:** భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు దిల్లీ కంటోన్మెంట్‌లోని ఆర్మీ రీసెర్చ్ అండ్ రిఫరల్ ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ప్రణబ్ ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని పేర్కొన్నాయి. ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్ సోకడంతో ప్రస్తుతం వెంటిలేటర్‌పైనే ఉంచి చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రక్తప్రసరణ సవ్యంగానే ఉందని, ఆయన ఆరోగ్య పరిస్థితిని నిపుణుల బృందం నిశితంగా పర్యవేక్షిస్తోందని తాజాగా విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌లో ఆర్మీ ఆసుపత్రి పేర్కొంది. మెదడులో రక్తం గడ్డకట్టడంతో ప్రణబ్‌కు ఈ నెల 10వ తేదీన శస్త్రచికిత్స చేశారు. ఆ సమయంలో జరిపిన వైద్య పరీక్షల్లో ప్రణబ్‌కు కొవిడ్ వైరస్ సోకినట్లు తేలిన విషయం తెలిసిందే.

## భారత్‌లో 29లక్షలు దాటిన కరోనా కేసులు!

**ఒకేరోజు 62వేల మంది రికవరీ!**

**24గంటల్లో 68వేల కేసులు, 983 మరణాలు**



**దిల్లీ:** భారత్‌లో కరోనా వైరస్ మహమ్మారి ఉద్ధృతి కొనసాగుతూనే ఉంది. నిత్యం రికార్డుస్థాయి కేసులు బయటపడుతున్నాయి. గడిచిన 24గంటల్లో కొత్తగా మరో 68,898 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అంతకుముందు రోజు అత్యధికంగా 69వేల కేసులు నమోదైన విషయం తెలిసిందే. శుక్రవారం నాటికి దేశంలో కరోనా కేసుల సంఖ్య 29,05,823కు చేరినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ వెల్లడించింది. వీరిలో ఇప్పటివరకు 21లక్షల 58వేల మంది కోలుకోగా మరో 6లక్షల 92వేల క్రియాశీల కేసులు ఉన్నాయి. నిన్న కొత్తగా మరో 983మంది కొవిడ్ రోగులు మృత్యువాతపడ్డారు. దీంతో దేశంలో కరోనా మరణాల సంఖ్య 54,849కి చేరింది. దేశంలో పాజిటివ్ కేసుల సంఖ్య పెరగుతున్నప్పటికీ కోలుకుంటున్న వారిసంఖ్య క్రమంగా పెరుగుతోంది. నిన్న ఒక్కరోజే మరో 62వేల మంది కరోనా రోగులు కోలుకున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో కరోనా బాధితుల రికవరీ రేటు 73.91శాతంగా ఉండగా, మరణాల రేటు 1.90శాతంగా ఉంది. ఇదిలాఉంటే, భారత్‌లో కొవిడ్ నిర్ధారణ పరీక్షలను భారీగా నిర్వహిస్తున్నారు. నిత్యం దాదాపు 8నుంచి 9లక్షల శాంపిళ్లను పరీక్షిస్తున్నారు. గడిచిన 24గంటల్లో 8లక్షల 5వేల శాంపిళ్లకు కొవిడ్ టెస్టులు నిర్వహించినట్లు భారత వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్) వెల్లడించింది. దేశంలో ఇప్పటివరకు 3కోట్ల 34లక్షల శాంపిళ్లకు కరోనా పరీక్షలు పూర్తిచేసినట్లు ఐసీఎంఆర్ పేర్కొంది.

## వ్యాక్సిన్ ఉత్పత్తిలో భారత్ సాయం కోరిన రష్యా



**దిల్లీ/మాస్కో:** రష్యా అభివృద్ధి చేసిన కరోనా వ్యాక్సిన్ స్పుత్నిక్-వి ఉత్పత్తిలో భారత్ భాగస్వామ్యం కోసం ఎదురుచూస్తున్నట్లు రష్యా డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఆర్‌డీఐఎఫ్) సీఈవో కిరిల్ దిమిత్రియేవ్ తెలిపారు. కొద్ది రోజుల క్రితం కరోనాకు తొలి వ్యాక్సిన్‌ను రష్యా అభివృద్ధి చేసినట్లు ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాక్సిన్ కరోనాపై ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుందని, స్థిరమైన రోగనిరోధక శక్తిని ఏర్పరుస్తుందని వెల్లడించారు. ఈ వ్యాక్సిన్‌ను రష్యాకు చెందిన గమలేయా పరిశోధన సంస్థ, రష్యా రక్షణ మంత్రిత్వశాఖ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. తాజా మీడియా సమావేశంలో దిమిత్రియేవ్ మాట్లాడుతూ వ్యాక్సిన్ తయారీకి లాటిన్ అమెరికా, ఆసియా దేశాలతో పాటు మరి కొన్ని దేశాలు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. "వ్యాక్సిన్ తయారీ అనేది ఎంతో ముఖ్యమైన విషయం. ప్రస్తుతం మేం భారత్‌తో భాగస్వామ్యం కోసం ఎదురుచూస్తున్నాం. వారు గమలేయ వ్యాక్సిన్ ఉత్పత్తి చేయగలరని మేం నమ్ముతున్నాం. ప్రస్తుతం వ్యాక్సిన్‌కు ఉన్న డిమాండ్ దృష్ట్యా వారి భాగస్వామ్యంతోనే వ్యాక్సిన్‌ను మేం సరఫరా చేయగలం" అని దిమిత్రియేవ్ తెలిపారు. గతంలోనే వ్యాక్సిన్ ఉత్పత్తికి సంబంధించి భారత్‌తో చర్చలు జరిగాయి. స్పుత్నిక్-వి వ్యాక్సిన్‌కు సంబంధించి ఫేజ్-1, ఫేజ్-2 సాంకేతిక వివరాలను ఆర్‌డీఐఎఫ్‌ను భారత కంపెనీలు అడిగాయి. అన్ని అనుమతులు పూర్తి చేసుకున్న అనంతరం దేశీయంగా వ్యాక్సిన్ ఉత్పత్తితో పాటు ఎగుమతికి అనుమతి కోరినట్లు మాస్కోలోని భారత రాయబార కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో దిమిత్రియేవ్ తాజా ప్రకటన చేశారు. అలానే భారత్, యుఏఈ, సౌదీ అరేబియా, బ్రెజిల్‌లో కూడా స్పుత్నిక్-వి క్లినికల్ ట్రయల్స్ చేయాలని అనుకుంటున్నట్లు వెల్లడించారు.

## మరో వివాదంలో ట్రంప్..!

**ఆ టైర్లను బాయ్‌కాట్ చేయాలని పిలుపు**



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో వివాదానికి తెరతీశారు. టైర్ల తయారీ దిగ్గజ సంస్థ 'గుడ్ ఇయర్ టైర్ అండ్ రబ్బర్ కంపెనీ'ని బాయ్‌కాట్ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సంస్థ చర్యలు రాజకీయ పక్షపాత పూరితంగా ఉన్నాయని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ ఉద్యోగులు "మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్" (అమెరికాను తిరిగి గొప్పగా చేయండి) అనే నినాదం రాసి ఉన్న దుస్తులను, టోపీలను ధరించ రాదని గుడ్ ఇయర్ ఆంక్షలు విధించటాన్ని ట్రంప్ తప్పుపట్టారు. రిపబ్లికన్ పార్టీ సానుభూతిపరుల నినాదాన్ని కలిగిన టోపీలను ధరించటాన్ని నిషేధించిన గుడ్ ఇయర్ టైర్లను కొనవద్దని ట్రంప్ ట్విటర్ ద్వారా పిలుపునిచ్చారు. ట్రంప్ ట్వీట్ అనంతరం, ఆ కంపెనీ షేర్ల విలువ 6 శాతం మేరకు పడిపోవటం గమనార్హం. అయితే తాము ఏ పార్టీకి సానుభూతి చూపటం లేదని, ఈ ఒక్కటే కాకుండా వివాదాస్పదమైన ఏ నినాదాన్ని కలిగిన ఆహార్యాన్ని ధరించరాదని తమ నియమావళిలో చెప్పినట్టు గుడ్ ఇయర్ స్పష్టం చేసింది. అంతేకాకుండా 60వేల మందికి పైగా అమెరికన్లకు ఉపాధి కల్పించిన గుడ్ ఇయర్‌పై ట్రంప్ కత్తికట్టడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. ఈ విషయంలో వెనక్కు తగ్గని ట్రంప్.. అంతగా అవసరమైతే వారందరి ఇంతకంటే మరింత మంచి ఉద్యోగాలు దొరుకగలవని ప్రకటించారు. అయితే, ట్రంప్ ప్రత్యేక వాహనం 'ద బీస్ట్'కు వాడే టైర్లు కూడా గుడ్ ఇయర్ కంపెనీవే కావడం కొసమెరుపు!!

## కోలికోడ్: సాయం చేసిన 26 మందికి కరోనా



**కోలికోడ్:** కేరళలోని కోలికోడ్ ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ సమయంలో అదుపుతప్పి ఎయిరిండియా విమానం ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు.. గాయపడిన ప్రయాణికులను వివిధ ఆసుపత్రులకు తరలించి ప్రాణాలు కాపాడగలిగారు. అలా సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న 26మంది స్థానికులకు కరోనా వైరస్ సోకినట్లు మలప్పురం జిల్లా వైద్య అధికారులు వెల్లడించారు. విమాన ప్రమాదంలో మరణించిన ప్రయాణికుల్లో ఒకరికి కొవిడ్ నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న వాలంటీర్లను క్వారంటైన్లో ఉండాలని సూచించారు. అనంతరం వారికి కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా చాలా మందికి వైరస్ సోకినట్లు తేలింది. ప్రస్తుతం వారిలో 26మందికి కొవిడ్ నిర్ధారణ అయినట్లు వెల్లడైంది. అయితే ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక యువకులు స్పందించిన తీరుపై దేశవ్యాప్తంగా సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఇప్పటికే విమానయాన సంస్థ ఎయిరిండియా కూడా ధన్యవాదాలు తెలిపింది. ఆపత్కాలంలో స్పందించిన తీరుకు వారికి రుణపడి ఉంటామని ప్రకటించింది. ఇప్పటికే స్థానిక జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు మరో 21మంది అధికారులకు వైరస్ సోకిన విషయం తెలిసిందే. వీరందరూ విమాన ప్రమాద ఘటనా ప్రాంతంలో ఉండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## ఎయిర్‌పోర్ట్ లీజుపై ప్రధానికి విజయన్ లేఖ



**తిరువనంతపురం:** ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధ్వర్యంలోని తిరువనంత పురం ఎయిర్‌పోర్టును అదానీ ఎంటర్‌ప్రైజెస్ సంస్థకు 50 ఏళ్ల కాలానికి లీజుకు ఇవ్వడంపై కేరళ సర్కారు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎయిర్‌పోర్ట్ నిర్వహణ బాధ్యతలను తమకు అప్పగిస్తామన్న హామీని కేంద్ర కేబినెట్ విస్మరించిందని పేర్కొంది. ఈ మేరకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రధాని మోదీకి లేఖ రాశారు. జయపుర, గువాహటి, తిరువనంతపురం విమానాశ్రయాలను అదానీ ఎంటర్‌ప్రైజెస్ సంస్థకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఆయన ఈ లేఖ రాశారు. తిరువనంతపురం విమానాశ్రయానికి కేరళ సర్కారు 2005లో 23.57 ఎకరాల భూమిని ఉచితంగా ఏఏఐకి బదలాయించింది. అయితే, స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) కింద రాష్ట్ర ప్రభుత్వానికి ఎయిర్‌పోర్ట్ నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తామని ఏఏఐ అప్పట్లో హామీ ఇచ్చింది. కేంద్ర కేబినెట్ తాజాగా తీసుకున్న నిర్ణయం ఆ హామీని విస్మరించిందని విజయన్ తన లేఖలో పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పదే పదే చేసిన విజ్ఞప్తులను పక్కన పెట్టి కేంద్ర కేబినెట్ ఏకపక్ష నిర్ణయం తీసుకుందని తప్పుబట్టారు. కేబినెట్ నిర్ణయానికి తాము సహకరించబోమని స్పష్టంచేశారు. ఈ విషయంలో ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలని కోరారు. కోచి, కన్నూర్ విమానాశ్రయాలను ఎస్పీవీ కింద రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా నిర్వహిస్తున్న విషయాన్ని లేఖలో పొందుపరిచారు. దీనిపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి స్పందించారు. బిడ్డింగ్ ప్రక్రియలో కేరళ ప్రభుత్వం అర్హత సాధించలేదని తెలిపారు.

## హారిస్ ప్రసంగంలో భారతీయ పదం



**వాషింగ్టన్:** నవంబరులో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరఫున ఉపాధ్యక్ష పదవికి పోటీ పడుతున్న కమలా హారిస్.. బుధవారం ఆమె అభ్యర్థిత్వాన్ని అంగీకరిస్తూ కీలక ప్రసంగం చేశారు. ఉపాధ్యక్ష పదవికి పోటీచేయడం ఎంతో గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. అలానే తన తల్లి నేర్పిన విలువలకు, జో బైడెన్ ఆలోచనలకు కట్టుబడి పనిచేస్తాని అన్నారు. ఈ సందర్భంగా ఆమె తన ప్రసంగంలో 'చిత్తి' అనే తమిళ పదం ఉపయోగించారు. దాంతో దాని అర్థం ఏమై ఉంటుందా అని తెలుసుకునేందుకు నెటిజన్లు గూగుల్‌లో విపరీతంగా వెతికారట. చాలాసేపు ఆ పదం గూగుల్ ట్రెండ్స్‌లోకి రావడంతో నెట్టింట్లో దాని గురించి చర్చ జరుగుతోంది. ఇంతకీ తమిళంలో 'చిత్తి' అంటే పిన్ని అని అర్థం. భారతీయ మూలాలున్న కమలా హారిస్ తన ప్రసంగంలో కుటుంబ ప్రాధాన్యం గురించి చెప్పుకొస్తూ ఈ పదం ఉపయోగించారు. చిన్నతనంలో తన తల్లితో దిగిన ఫొటోలు షేర్ చేస్తూ "నాకు, నా సోదరికి నా తల్లి ఎన్నో విలువలు నేర్పింది. కుటుంబానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని నేర్పింది" అని చెప్పుకొచ్చారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కుటుంబం, భారతీయ సంప్రదాయం, భాష గురించి ప్రస్తావించడం ఇదే తొలిసారి అని అక్కడి వారు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా ట్రంప్‌పై కూడా ఆమె తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆయన మన విషాదాలను అస్త్రాలుగా మార్చుకుంటున్నారని, ఆయన నాయకత్వ వైఫల్యం మన జీవితాలను ప్రమాదంలోకి నెట్టివేసిందని విమర్శించారు.

## ఆధార్‌తో పాన్ నెంబర్‌ను లింక్ చేశారా...లేదంటే



**న్యూఢిల్లీ :** ఆధార్ కార్డుతో పాన్ నెంబర్‌ను నిర్దేశిత గడువులోగా లింక్ చేసుకోని వినియోగదారులు త్వరగా ఆ పని పూర్తి చేయండి. లేదంటే కార్డు పనిచేయకుండా పోతుంది. ఆధార్‌తో అనుసంధానం కాని పాన్ కార్డుల రద్దుపై ఇప్పటికే పలు హెచ్చరికలను జారీ చేసిన ఆదాయ పన్ను శాఖ భారీ సంఖ్యలో పాన్ కార్డులకు చెక్ పెట్టేందుకు సిద్ధమవుతోంది. అలాగే రెండు లేదా అంతకంటే ఎక్కువ పాన్ కార్డులతో అధిక మొత్తాల్లో లావాదేవీలు నిర్వహిస్తూ తప్పించుకుంటున్న పన్ను ఎగవేతదారులపై కూడా ఐటీ శాఖ కొరడా ఝుళిపించనుంది. దీంతోపాటు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, మ్యూచువల్ ఫండ్, క్రెడిట్,డెబిట్ కార్డులు ద్వారా జరిపే భారీ లావాదేవీలపై కూడా నిఘా పెట్టనుంది. పాన్‌ను ఆధార్ కార్డుతో అనుసంధానించడానికి గడువు 2021 మార్చి 31వ తేదీ లోపు లింకింగ్ ప్రక్రియ పూర్తి చేచేయకపోతే కనీసం180 మిలియన్ల (18 కోట్ల) కార్డులు రద్దయ్యే అవకాశం ఉందని ఒక నివేదిక తెలిపింది. 130 కోట్ల జనాభాలో కేవలం15 మిలియన్ల మంది మాత్రమే ఆదాయపు పన్ను రిటర్నులను దాఖలు చేశారని ఐటీ అధికారి ఒకరు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వీరిలో 2.5 లక్షల రూపాయల లోపు ఆదాయం ఉన్న సంస్థలు 57 శాతం, 2.5 నుంచి 5 లక్షల రూపాయల మధ్య ఆదాయం ఉన్నవారు పద్దెనిమిది శాతం, 5 నుండి 10 లక్షల మధ్య ఆదాయం ఉన్నవారు 17శాతం, 10 నుంచి రూ .50 లక్షల మధ్య ఆదాయం ఉన్నవారు 7 శాతం, 50 లక్షలకు పైగా ఆదాయం ఉన్నవారు ఒక శాతం మాత్రమే ఐటీ రిటర్న్ దాఖలు చేశారు. కాగా 32.71 కోట్లకు పైగా పాన్ కార్డులను బయోమెట్రిక్ ఐడీ ఆధార్‌తో అనుసంధానం చేసినట్లు ఇటీవల ప్రభుత్వం తెలిపింది. జూన్ 29 నాటికి జారీ అయిన మొత్తం పాన్ కార్డుల సంఖ్య 50.95 కోట్లుగా ఉందని మైగోవ్‌ఇండియా ఒక ట్వీట్‌లో పేర్కొంది.

## కోవిడ్ వారియర్స్ పేరుతో ఐటీ దాడులు



**భోపాల్:** మధ్యప్రదేశ్ ఆదాయపు పన్ను శాఖ అధికారులు వినూత్నంగా ఆలోచించారు. కోవిడ్ వారియర్స్ పేరుతో సుమారు 150 మంది ఐటీ అధికారులు ఇద్దరు వ్యాపారవేత్తలకు సంబంధించిన 20 చోట్ల దాడులు నిర్వహించారు. 100 స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలతో పాటు రూ. కోటి విలువైన నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఒకరు ఫెయిత్ గ్రూప్ అధ్యక్షుడు రాఘవేంద్ర సింగ్ తోమర్. ఆయనకు ప్రస్తుతం శివరాజ్ సింగ్ చౌహాన్ కేబినెట్‌లో మంత్రిగా ఉన్న ఓ వ్యక్తితో దగ్గరి సంబంధాలు ఉండటంతో ఈ దాడులు కలకలం రేపుతోంది. వివరాలు.. రాఘవేంద్ర సింగ్ తోమర్‌తో పాటు మరో వ్యాపారి వద్ద ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయనే సమాచారం మేరకు ఐటీ శాఖ దాడులు చేయాలని భావించింది. అయితే ఇందుకు సంబంధించిన సమాచారం లీక్ కాకుండా ఉండటం కోసం కోవిడ్ వారియర్స్ పేరుతో రంగంలోకి దిగారు. తమ వాహనాల మీద కూడా 'మధ్యప్రదేశ్ ప్రభుత్వం, ఆరోగ్య శాఖ కోవిడ్-19 బృందాన్ని ఆహ్వానిస్తుంది' అనే స్టిక్కర్లను అంటించుకున్నారు. ఇక వీరంతా తోమర్‌తో పాటు మరో వ్యాపారికి చెందిన 20 చోట్ల ఏకకాలంలో దాడులు జరిపారు. ఇవి ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు దాదాపు 100 స్థిరాస్తులకు చెందిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాక ఈ వ్యాపారవేత్తలకు భోపాల్, సెహోర్ జిల్లాలో రెండు క్రికెట్ మైదానాలు ఉన్నాయని సమాచారం. వీటి విలువ వందల కోట్ల రూపాయలు ఉంటుందని అధికారులు అంచాన వేస్తున్నారు. ఇక ఈ దాడులపై కాంగ్రెస్ స్పందిస్తూ.. 'ఇది కేబినెట్ మంత్రి అర్హతను తగ్గిస్తుంది. ఇటీవల అదే మంత్రి రాఘవేంద్ర తోమర్‌ని తన సోదరుడిగా బహిరంగంగా ప్రకటించారు. ఇక ఈ దాడుల నేపథ్యంలో తోమర్‌తో అతడి సంబంధాలను ప్రజలకు తెలియచేయాలి' అంటూ కాంగ్రెస్ అధికార ప్రతినిధి నరేంద్ర సలుజా ట్వీట్ చేశారు. బీజేపీ అధికార ప్రతినిధి రజనీష్ అగర్వాల్ కాంగ్రెస్ ఆరోపణలపై స్పందిస్తూ.. ఆదాయపు పన్ను శాఖ చట్ట ప్రకారం తన పని తాను చేసుకుపోతుంది. బీజేపీ నాయకులను కించపర్చడానికే కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు చేస్తోంది అన్నారు.




# పేదలకు అండగా నిలిచిన పాకా రాజారావు: భీశెట్టి



**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 21 :** ప్రజాస్వామ్యంలో జరుగుతున్న లోపాలను ఎండగడుతూ విద్యావేత్త గా పాకా రాజారావు పేదలకు అండగా ఉండేవారని, విజయనగరం జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు, పాకారాజారావు 68 వ జయంతి సందర్భంగా పాకా విగ్రహంకి దండ వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ దళిత కుటుంబంలో పుట్టిన పాకా అంచెలంచెలుగా ఎదిగి ఎన్నో ఉద్యమంలో చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించారని తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరవరకూ కూడా భారతీయ జనతా పార్టీ కోసం పనిచేశారని దేశంలో అనేక ప్రాంతాల్లో పర్యటించి కీలకమైన ఉపన్యాసాలు అందించినవారిలో మన జిల్లానుండి పాకారాజారావు కూడా ఉన్నారని..పాకా రాజారావు లేని లోటు దళిత వర్గానికి,విజయనగరం జిల్లా రాజకీయాలకి కనిపిస్తోందని భీశెట్టి అన్నారు.

## మాన్సాస్ సిబ్బందికి వేతనాలు విడుదల

**జిల్లా రెవిన్యూ అధికారి ఎం. గణపతిరావు**



**పార్వతీపురం, వార్తావళి, ఆగస్ట్ 21 :** మాన్సాస్ ట్రస్ట్ కు చెందిన విద్యా సంస్థలకు వేతనాల కోసం రూ.3 కోట్ల 10 లక్షలు విడుదలైనట్లు జిల్లా రెవిన్యూ అధికారి ఎం. గణపతిరావు తెలిపారు. శుక్రవారం ఆయన చాంబరులో మాన్సాస్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగష్ట్ 11న మాన్సాస్ కరస్పాండెంట్ కె. లక్ష్మీపతిరాజు జీతాల బకాయిలకు కావలసిన నిధుల కోసం లేఖ రాయగా ఆగష్ట్ 12న నిధులు మాన్సాస్ ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలిపారు. ఈ నిధులతో 2020 ఏప్రెల్, మే, జూన్ నెలలకు నిబంధనలను ననుసరించి చెల్లింపు చెయ్యాలని సూచించారు. భవిష్యత్ లో కూడా జీతాలకు ఇబ్బంది లేకుండా ఉండేలా ముందుగానే ఇండెంట్ను, కార్యాచరణ ప్రణాళికను పంపించాలన్నారు. భవిష్యత్ లో వేతనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలక్టరు డా. ఎం. హరి జవహర్ లాల్ ఆదేశాల జారీ చేసారని తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రాజారావు, మాన్సాస్ సూపరింటెండెంట్ కె.వి.రమణారావు హాజరయ్యారు.

## వరాహలక్ష్మీ నరసింహస్వామికి విశేష పంచామ్రుతాభిషేకం



**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 21 :** ఓం నమోభ్ఘ్న వరాహ లక్ష్మీ నరసింహస్వామి స్వామినే నమ: విజయనగరం శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానము, సంతపేట లో ఈ రోజు తేది 21-08-2020,శుక్రవారం,"శ్రీ వరాహ జయంతీ" తిరునక్షత్రోత్సవ సంద ర్భముగా దేవాలయంలో వేంచే సి. యున్న శ్రీ భ్ఘువరాహలక్ష్మీ నరసింహస్వామి వారికి విశేష పంచామ్రుతాభిషేకం, చలువ చందన సమర్పణ, అష్టోత్తర శతనామార్చన, సేవాకాలం, మహాప్రసాద నివేదనము, శాత్తుమ్మొఱ, మంగళాశాసనము, తీర్థప్రసాద వినియోగము, (విజయనగరం లో ప్రభుత్వ నిబంధ నలు అనుసరించి కొద్ది మంది. భక్తులతో. వైభవంగా నిర్వహిం పబడినది. తితిదేవస్థాన ద్రవిడ వేద పండితులు శ్రీ అనంత వెంకట జగన్నాధాచార్యస్వామి, అప్పలనరశింహాచార్య, పవన్కల్యాణ్ స్వామి, ఆధ్వర్యంలో కార్యక్రమం శ్రద్ధాభక్తులతో జరిపించారు.

# గైర్హాజరయిన యస్.జి.టి విధుల నుండి తొలగింపు

**స్పష్టం చేసిన జిల్లా విద్యాశాఖాధికారి కె.చంద్రకళ**



**శ్రీకాకుళం, వార్తావళి, ఆగస్ట్ 21:** శ్రీకాకుళం మండలం రాయిపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో యస్.జి.టిగా పనిచేసిన పి.నిర్మలాకు మారిని శాశ్వతంగా విధుల నుండి తొలగిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కుసుమ చంద్రకళ స్పష్టం చేసారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసారు. 2014 జూలై 6వ తేదీ నుండి పి.నిర్మలా కుమారి దీర్ఘకాలిక సెలవులపై (అనుమతి లేకుండా) విధులకు గైర్హాజయినారని,ఈ విషయమై పలుమార్లు నోటీసులు జారీచేయడం జరిగిందని ఆమె తెలిపారు. అయినప్పటికీ ఆమె విధులలో చేరకపోవడంతో శ్రీకాకుళం మండల ఉప విద్యాశాఖాధికారి (ఆర్ఎంఎస్ఎ) ద్వారా దర్యాప్తు చేపట్టామని, ఆమె విదేశాలలో ఉన్నందున ఆచూకి తెలియరానట్లు నివేదికలో వెల్లడైందని పేర్కొన్నారు. అందువలన ఎపి సివిల్ సర్వీస్ నియమావళి (సిసి అండ్ ఎ) 1991 ప్రకారం 2020 జూలై 10వ తేదీన ఫైనల్ నోటీసును జారీచేస్తూ, విధులకు గైర్హాజరయిందున విధుల నుండి శాశ్వతంగా ఏల తొలగించరాదో 15 దినముల్లోగా సంజాయిషీ కోరడం జరిగిందని ఆమె తెలిపారు. అయినప్పటికీ ఆమె నుండి ఎటువంటి సంజాయిషీ అందనందున, అనధికార గైర్హాజరు కాలపరిమితి 5 సం.లు దాటినప్పటికీ గడువులోగా తిరిగి విధులలో చేరనందున వారిని విధుల నుండి శాశ్వతంగా తొలగించబడునని ఆమె ఆ ప్రకటనలో వివరించారు.

# ఆదివారం ... శ్రీకాకుళం లాక్‌డౌన్

**శ్రీకాకుళం, వార్తావళి, ఆగస్ట్ 21:** కోవిడ్ నివారణ చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్ మరియు నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి నివాస్ సరికొత్త నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ నెల 16వ తేదీ వరకు నిత్యావసరాలు, మందుల దుకాణాలకు మాత్రమే ఉదయం 6 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అనుమతించిన కలెక్టర్ 17వ తేదీ నుండి అన్ని రకాల దుకాణాలను తెరచుటకు అనుమతించారు. తద్వారా వ్యాపార కార్యకలాపాలు జరగడమే కాకుండా వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండగలదని యోచించారు. ఇదే సమయంలో ప్రజలు అనవసరంగా బయట తిరిగి వైరస్ కు గురి కాకూడదని, వైరస్ వ్యాప్తికి కారణం కారదని ఆదివారం సంపూర్ణ లాక్ డౌన్ ను విధించారు. ఆది వారం రోజున ప్రజలు పెద్ద ఎత్తున మార్కెట్ల వంటి ప్రదేశాల్లో అధిక రద్దీకి కారణమౌతున్నారు. కూరగాయల మార్కెట్లు ముఖ్యంగా చేపల మార్కెట్ల వద్ద చూడగానే భయపడేంత పరిస్థితులు కనిపిస్తున్నాయి. తాజా చేపలు కొనుక్కోవాలనే తపనతే కరోనా సోకుతుందనే ఆలోచన కొరవడుతోంది. తాజా చేపలు కావాలా ? లేదా తాజాగా కరోనా పేషెంట్ గా మారుతావా ? అంటూ ఒక సందేశాన్ని ఇస్తూ తాజ చేపలకు తాపత్రయం వద్దు, ఆరోగ్య సురక్షితంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ నివాస్ జూన్ లోనే సూచనలు జారీ చేసారు. అయితే ప్రజలలో అప్రమత్తత పూర్తి స్థాయిలో లేకపోవడంతో కేసుల సంఖ్య జూన్ నాటికి ఇప్పటికి బాగా పెరగడం జరిగింది. ఈ నేపధ్యంలో ఆదివారం సంపూర్ణ లాక్ డౌన్ ను ఈ నెల 23వ తేదీ నుండి ప్రారంభం అవుతుంది. కేవలం మందుల దుకాణాలు మాత్రమే తెరచుటకు అనుమతించారు. మందుల దుకాణాల వద్దనే పాలు, బ్రెడ్ మధ్యాహ్నం ఒంటి గంట వరకు అనుమతించారు. అత్యవసర వైద్యం కోసం ఏ సమయంలోనైనా అనుమతిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. అత్యవసర వేళం అంబులెన్సులు అందుబాలో లేకపోతే సొంత వాహనాల్లో సైతం అనుమతిస్తామని కలెక్టర్ పేర్కొంటూ అత్యవసర వైద్య సేవల పేరిట దుర్వినియోం చేసే వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేసారు. సంపూర్ణ లాక్ డౌన్ కారణంగా ఆలయాలలో నిత్యకైంకర్య సేవలు ఉంటే ఉదయాన్నే త్వరితగతిన ముగించాల్సి ఉంటుంది. ప్రార్ధనా మందిరాలు, సమూహిక కార్యక్రమాలు వంటివి చేపట్టుటకు అవకాశం లేదు. కరోనా కారణంగా లాక్ డౌన్ విధించినప్పటి నుండి జిల్లా వాసులు చక్కటి సహకారం అందిస్తున్నారని, అదే సహకారాన్ని సంపూర్ణ లాక్ డౌన్ జరిగే ఆది వారం కూడా అందించి ప్రతి వ్యక్తి, కుటుంబం, జిల్లా ఆరోగ్యంగా, సుఖంగా ఉండాలని కలెక్టర్ ఆశిస్తున్నారు.



ఆగష్టు 22 శనివారం వినాయక చవితి సందర్భంగా విజయనగరం మార్కెట్లో పూజా సామాగ్రిని కొనుగోలు చేయడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు బయటకు వచ్చారు. – వార్తావళి, విజయనగరం

# మట్టి గణపతినే పూజించండి.. పర్యావరణాన్ని కాపాడండి



**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 21 :** పర్యావరణాన్ని కాపాడేలా ప్రతీ ఒక్కరూ మట్టితో చేసిన వినాయక విగ్రహాలనే పూజించాలని జిల్లా గ్రంధాలయ సేవా సంఘం అధ్యక్షులు నాలుగెస్స్ ల రాజు కోరారు. శుక్రవారం నాడు పట్టణంలోని 92వ రేషన్ డిపో వద్ద గొర్లె సురేష్ ఆధ్వర్యంలో 700 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన నాలుగెస్స్ ల రాజు మాట్లాడుతూ హానికారకమైన రంగులతో చేసిన విగ్రహాల వలన పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడే ప్రమాదముందని అన్నారు. పర్యావరణం పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కె. దయానంద్, సామాజిక కార్యకర్త అబ్దుల్ రవూఫ్, వైసీపీ నాయకులు తోట రాజశేఖర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం. త్రినాధ్, డీలర్ జి.సాయి భవాని తదితరులు పాల్గొన్నారు.



సాలూరు మండలం కొట్టకి గ్రామంలో గిరిజన విశ్వ విద్యాలయ స్థల పరిశీలనకు విచ్చేసిన కేంద్ర బృందం సభ్యులు ప్రొఫెసర్ ఆర్.ఎస్.సర్రాజు విభాగాధిపతి, సెంటర్ ఫర్ దళిత, ఆదివాసీ మరియు అనువాద అధ్యయనాలు, వారికి రేఖా చిత్రాలతో వివరాలు తెలుపుచున్న సాలూరు,బొబ్బిలి శాసన సభ్యులు శంబంగి వెంకట చిన్న అప్పల నాయుడు, పిడిక రాజన్న దొర, ఐ.టి.డి.ఎ ప్రాజెక్టు అధికారి అర్.కూర్మనాథ్, పార్వతీపురం సబ్ కలెక్టర్ విధే ఖర్. – వార్తావళి, ఎస్కోట

# ఇంటిలోనే వినాయక చవితి

**కోవిడ్ దృష్ట్యా ఇంట్లోనే నిర్వహించుకోవాలని**
**జిల్లా కలెక్టర్ జె నివాస్ పిలుపు**
**మండపాలు, సామూహిక పూజలకు అనుమతి లేదు**

**శ్రీకాకుళం, వార్తావళి, ఆగస్ట్ 21:** నేడు వినాయక చవితి. గతంలో వినాయక చవితి అంటే వీధి, వాడ అంతటా హడావిడి కనిపించేది. అయితే కోవిడ్ 19 దృష్ట్యా వైరస్ వ్యాప్తి నివారణలో భాగంగా పూజలు ఇంటి వద్దనే చేసుకోవాలని జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం పరిమితులు విధించింది. ఈ ఏడాదిలో అన్ని పండగలూ మతాలకు అతీతంగా ఇంటిలోనే నిర్వహించుకోవడం జరిగింది. అందులో భాగంగా వర సిద్ధి వినాయకుని పూజలు సైతం ఇంటి వద్దనే నిర్వహించుకొనుటకు ప్రజలు అందరూ సన్నద్ధులయ్యారు. బహిరంగ ప్రదేశాల్లో మండపాలు ఏర్పాటు చేసి వినాయక చతుర్ధి పూజలు నిర్వహించరాదని కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ జె నివాస్ వారం రోజులు క్రితమే ప్రకటించగా, రాష్ట్ర ప్రభుత్వం కూడా తాజాగా ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విదితమే. సామూహిక పూజా కార్యక్రమాలు, అధిక సంఖ్యలో భక్తుల సందర్శన వలన వైరస్ వ్యాప్తి అధికం అయ్యే అకాశాలు ఎక్కువ కానున్నందున బహిరంగ ప్రదేశాల్లో మండపాల నిర్వహకు అనుమతించ లేదు.

శ్రీకాకుళం పట్టణంలో వైరస్ వ్యాప్తి అధికంగా ఉండటంతో మరిన్ని ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిన విషయం విదితమే. ప్రతి ఒక్కరూ ఇంటిలోనే పూజలు నిర్వహించుకుని కుటుంబ సభ్యులు అందరూ ఆరోగ్యంగా, క్షేమంగా ఉండాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. వైరస్ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం వహించాలని, అత్యవసర పరిస్థిల్లో మినహా బయటకు రావద్దని సూచిస్తూ బయటకు వచ్చిన వ్యక్తులు విధిగా మాస్కు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని, చేతులను శుభ్రపరచుకోవాలని కోరారు. ఫేస్ షీల్డ్‌లను ధరించుట అలవాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా 80 శాతం మేర వైరస్ కు గురి కాకుండా ఉండగలమని చెప్పారు.

## భూమి లేని వారిని గుర్తించండి

**గిరిజన సం.ఘం కార్యదర్శి ఆదేశం**

**పార్వతీపురం, వార్తావళి, ఆగస్ట్ 21 :** గిరిజన ప్రాంతంలో ఇంటింటి సర్వే నిర్వహించి భూమిలేని పేదలను గుర్తించాలని గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతీలాల్‌దండే ఆదేశించారు. ఐటీడీఏ అధికారులతో ఆయన గురువారం దూరదృశ్య సమావేశాన్ని నిర్వహించారు. పార్వతీపురం తహసీల్దారు కార్యాలయం నుంచి ఐటీడీఏ పీఓ కూర్మనాథ్, ఏపీఓ సురేష్‌కుమార్, ఆర్వోఎఫ్ఆర్ యంత్రాంగం పాల్గొన్నారు. అక్టోబరు రెండు నాటికి అటవీహక్కులు కల్పించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. భూములను గుర్తించి, హద్దులను కూడా చూపించాలని సూచించారు. రెండు ఎకరాలు ఉన్న రైతులు, ఆలోపు విస్తీర్ణం ఉన్న రైతులను గుర్తించాలన్నారు. భూమిలేని వారికి ప్రాధాన్యమిచ్చి పట్టాలు తొలుత పంపిణీ చేయాలని ఆదేశించారు.

# కొవిడ్ ఆస్పత్రులను తనిఖీ చేయాలి

**మాట్లాడుతున్న జేసీ మహేష్‌కుమార్**

**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 21 :** కొవిడ్ ఆస్పత్రుల పర్యవేక్షణ కోసం నియమితులైన ప్రత్యేకాధికారులు ఆస్పత్రులను ప్రతిరోజూ తనిఖీ చేయాలని సంయుక్త కలెక్టర్(అభివృద్ధి) ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. ఆయన ఛాంబరులో కొవిడ్ ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ కొవిడ్ రోగులతోనూ, వైద్యులతోనూ మాట్లాడాలని చెప్పారు. మందులు, ఇతర అత్యవసర వైద్యానికి అవసరమయ్యే సామగ్రి నిత్యం అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

**పని తీరును సమీక్షించాలి**

సచివాలయాల్లో పని చేస్తున్న సహాయకులంతా ప్రతిరోజూ వారికి కేటాయించిన విధులను ప్రొటోకాల్ ప్రకారం నిర్వహించాలని, దీనిని ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు సమీక్షించాలని సంయుక్త కలెక్టర్(అభివృద్ధి) ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో బియ్యం కార్డులు, బయోమెట్రిక్, సంక్షేమ పథకాల అమలు, వాలంటీర్ల నియామకం, సచివాలయాల పనితీరు అంశాలపై ఎంపీడీవోలతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో వాలంటీర్ల పనితీరును సమగ్రంగా పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు.



# ప్రభుత్వ భవన నిర్మాణాల పురోగతిపై జె.సి. వెంకటరావు ఆరా

**డెంకాడ, పూసపాటిరేగ మండలాల్లో పరిశీలన**

**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 21 :** జిల్లాలోని వివిధ మండలాల్లో నిర్మాణంలో వున్న ప్రభుత్వ భవనాల నిర్మాణాలను జాయింట్ కలెక్టర్(ఆసరా, సంక్షేమం) జె.వెంకటరావు శుక్రవారం పరిశీలించారు. డెంకాడ, పూసపాటిరేగ మండలాల్లో ఆయన పర్యటించారు. డెంకాడ మండలంలో పినతాడివాడ, పెదతాడివాడ, గుణుపూరుపేట గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్ నెస్ కేంద్రాలను జె.సి. పరిశీలించారు. వాటి పురోగతిని తెలుసుకొని ఎప్పటిలోగా పూర్తవుతాయనే విషయాన్ని ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం పూసపాటిరేగ మండలం కొల్లాయవలసలో రైతుభరోసా కేంద్రాన్ని, గ్రామ సచివాలయాన్ని, వెల్ నెస్ కేంద్ర నిర్మాణాన్ని పరిశీలించారు.




# ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం

**సాలూరు, వార్తావళి, ఆగస్ట్ 21 :** ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తోందని కలెక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ తెలిపారు. ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి రెవెన్యూ, జలవనరుల శాఖ ఇంజినీర్లతో సమీక్ష సమావేశం కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసేకరణకు నిధుల సమస్య లేదని, పనులు వేగవంతం చేయాలని సూచించారు. తారకరామ తీర్థసాగర్, తోటపల్లి ప్రాజెక్టులతోపాటు, భోగాపురం విమానాశ్రయానికి భూసేకరణ కూడా సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాల పంపిణీకి సంబంధించి జిల్లాలో 15 వేల మంది గిరిజనులకు 23 వేల ఎకరాల భూమిని పంపిణీ చేయనున్నామని తెలిపారు. తొలుత సంయుక్త కలెక్టర్ కిశోర్‌కుమార్ ప్రాజెక్టుల వారీగా చర్చించారు. తోటపల్లి, తారకరామతీర్థసాగర్, గడిగెడ్డ, గుర్లగెడ్డ, కంచరగెడ్డ, ఆడారుగెడ్డ, గుమ్మిడిగెడ్డ తదితర రిజర్వాయర్లు, గజపతినగరం బ్రాంచ్ కెనాల్‌కు చెందిన భూసేకరణపై సమీక్షించారు. పార్వతీపురం సబ్‌కలెక్టర్ విధే ఖర్, విజయనగరం ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్, భూసేకరణ ప్రత్యేక ఉపకలెక్టర్లు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## వరద ఉధృతి

దేశంలో వర్షాకాలంలో వరదలు సంభవించడం విశేషమేమీ కాదు. కానీ, ఈ ఏడాది ముంబాయిలోనూ, తెలుగురాష్ట్రాల్లోనూ సంభవించిన వరదలు ప్రజా జీవితాన్ని అతలాకుతలం చేశాయి. నదీ, సముద్రతీర ప్రాంతాల్లో కాలానుగుణంగా వరదలు మామూలే. వినాయక చవితికి వీధుల్లో వరదనీరు పారుతుందన్నది సామెత. ఈ మధ్య వరసుగా కొద్ది సంవత్సరాలుగా అంతకుముందే వరదలతో నగరాలూ, మహానగరాలూ నదులుగా మారుతున్నాయి. మహానగరాలైన ముంబై, చెన్నైలకే తప్పని వరద తాకిడి ఇప్పుడు అన్ని నగరాలనూ చుట్టేస్తోంది. అదీగాక, నదులు, సముద్రతీరం లేని ప్రాంతాల్లోనూ ఈ వరద తాకిడి కష్టాలకు కారణమమతోంది. వర్షపునీరు వెళ్లే నాలాలు, చెరువులు, పెద్దపెద్దసాగరాలు నిండితే బయటకు నీరు విడిచిపెడితే వెళ్లే కాల్వ లు ఆక్రమణలకు గురవడమే ఇలాంటి పరిస్థితులకు కారణం. తెలంగాణలో మూసీ నది ఓ మురికి కాల్వలా మారిపోవడానికి ఆక్రమణలే కారణం. అలాగే ముంబైలో శతాబ్దాల నాటి మురుగునీటి వ్యవస్న ఆమురుగునీటిని సముద్రంలో కలిపే ఓనది ఆక్రమణలకు గురవడం తో ముంబాయిలో వరదలవల్ల మురికివాడలు, లోతట్టు ప్రాంతాలే కాకుండా భాగ్యవంతు ల కాలనీలు కూడా వరద తాకిడికి గురి అవుతున్నాయి. ముంబాయిలో అనధికార ఆక్రమణ ల కారణంగా వరద నీరు రోడ్లపై ప్రవహించింది. హైదరాబాద్లో వారం రోజులుగా కుండ పోత వర్షం వల్ల చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈసారి వరదల్లో వరంగల్ నగరం బాగా వరద తాకిడికి గురైంది. భద్రకాళి చెరువు, వడ్డేపల్లి చెరువు పొంగి వీధుల్లో నీరు ప్రవేశించింది. వరంగల్ వీధుల్లో పడవలపై జనం తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే వరద ప్రభావం ఎంత ఎక్కువగా ఉందో ఊహించవచ్చు. నాలుగేళ్ళ క్రితం కూడా వరంగల్ ఇదే మాదిరిగా తీవ్రమైన వరద తాకిడికి గురైంది. మురుగు కాలవల్లో నీరు బయటకుపోయే మార్గం లేక వీధుల్లో నీరు ప్రవహించింది. కాలువల గట్టులపై అనధికార ఆక్రమణల కారణంగా కూడా వరద నీరు బయటకు వెళ్ళే మార్గం లేక రోడ్లపై ప్రవహించింది. భారీ వర్షాలవల్ల రెండేళ్ళ క్రితం కేరళలోని అలెప్పీ జిల్లాలో అనేక ఇళ్ళు కొట్టుకుని పోయాయి. చెన్నై నగరాన్ని వరదలు ముంచెత్తిన దృశ్యాలు ఇప్పటికీ మన కళ్ళముందు కదలాడుతున్నా యి. వరదలు వచ్చినప్పుడు మాత్రమే భూగర్భ మురుగు నీటిపారుదల వ్యవస్థ గురించి, మురుగునీటి సౌకర్యాలను గురించి ఆలోచించడం ప్రభుత్వాలకు అలవాటైంది. మహానగరమైన ముంబాయిలోనే ఇలాంటి పాట్లు తప్పడం లేదు. నగరీకరణ పేరిట శివారు ప్రాంతాల లో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్న ప్రభుత్వాలు అనధికార ఆక్రమణలను ఆపలేక పోతున్నాయి. అన్ని చోట్లా ఇదే పరిస్థితి. ఇందుకు రాజకీయ జోక్యాలు ప్రధాన కారణం. వరదల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేలాది కోట్ల రూపాయిలు ఖర్చుచేస్తున్నా, అవి సక్రమంగా వినియోగపడక పోవడం వల్లనే ఇలాంటి దుస్తితి ఏర్పడుతోంది. ఒక్కమాటలో చెప్పాలంటే మహానగరాల్లో వరద బీభత్సానికి స్వయంకృతమే కారణం.

నదీతీర ప్రాంతాల్లో పరిస్థితులు వరద ఉధృతి, ప్రభుత్వ ముందుజాగ్రత్తను బట్టి ఉంటుంది. ప్రస్తుతం భద్రాచలం వద్ద నీరు 65 అడుగులు దాటిపోయే పరిస్థితి ఉంది. రాజమహేంద్రవరం పాత ఆనకట్ట వద్దకూడా వరద ఉధృతి ఎక్కువగా ఉంది. విలీన గ్రామాలన్నీ వరద తాకిడికి గురి అయ్యాయి. భద్రాద్రి, కొత్తగూడెం జిల్లాల్లో అనేక గ్రామాలు జలమయం అయ్యాయి. అశ్వాపురంలో సీతారామసాగర్ వద్ద గోదావరికి అడ్డుగా నిర్మించిన మట్టికట్ట తెగిపోయింది. ఉభయ గోదావరి జిల్లాల్లో పలుచోట్ల కాజ్ వేలు తెగిపోయాయి. రాకపోకలు బంద్ అయ్యా యి. తెలుగు రాష్ట్రాల్లో వరద ఉధృతి ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రాణనష్టం లేదనే చెప్పవచ్చు. నీళ్ళలో కొట్టుకుపోతున్న రైతులను రక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం రెండు హెలికాప్టర్ల ను ఏర్పాటు చేసింది. అలాగే, కూనవరం, దుమ్ముగూడం వంటి పాంతాల్లో చిక్కుకున్న వారి నిరప్పించేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది. తెలుగురాష్ట్రాల్లో ప్రభుత్వాలు సకాలం లో అప్రమత్తమై అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేయడం వల్ల ప్రాణనష్టం చాలా వరకూ తగ్గింది. భవిష్యత్ లో మహానగరాల్లో వరద సమస్య ఎదురుకాకుండా ఉండాలంటే, మహా ప్రణాళికలు అమలుచేయడం ఓమార్గం. వాటి అమలులో వెనుకడుగే అతిపెద్ద సమస్య.

# దేశ దేశాన... జైజై గణేశా..



వినాయక చవితి వచ్చిందంటే చాలు బొజ్జ గణపయ్యను తీరొక్క రూపుగా కొలిచి ముచ్చట తీర్చుకుంటాం.మన భారతావనిలోనే కాదు.. చవితి పండుగ పూట దేశదేశాల్లో జైజై గణేశా నినాదాలు మిన్నంటుతాయి. విఘ్నేశ్వరుడి ఆరాధన విచిత్రంగా, విశేషంగా ఉంటుంది. ఆ సంగతులేంటో ఓసారి చూసేద్దాం.. హిందూ ధర్మంలోనే కాదు.. బుద్ధ, జైన ధర్మాల్లోనూ గణపతిని కొలిచే సంప్రదాయం ఉంది. ఆసియా ఖండంలో చాలా దేశాల్లో విఘ్నేశ్వర ఆరాధన శతాబ్దాలుగా నిర్విఘ్నంగా కొనసాగుతున్నది. టిబెట్, నేపాల్, శ్రీలంక, జపాన్ తదితర దేశాల్లో వినాయకుడికి ఆలయాలున్నాయి. మనం కొలిచే రూపానికి కాస్త అటూఇటూగా పార్వతీ తనయుడు పూజలు అందుకుంటున్నాడు.



**మయన్మార్‌లో బ్రహ్మగా:**
వినాయకుడు అంటే మనం శివపార్వతుల తనయు డిగా కొలుస్తాం. కానీ, మయన్మార్‌లో విఘ్నేశ్వరు డిని బ్రహ్మగా భావిస్తారు. అందుకు ఓ పురాతన గాథ కూడా ప్రచారంలో ఉంది. బ్రహ్మదేవుడి శిరస్సు భంగం అయినప్పుడు.. ఏనుగు తలను అతికించా రనీ.. అలా బ్రహ్మ దేవుడు కాస్తా గజాననుడిగా మారాడని విశ్వసిస్తారు. నేటికీ మయన్మార్‌లో వినాయక చవితికి గణపతిని పరబ్రహ్మగా పూజి స్తుంటారు. వినాయక చవితి సమయంలో వారం రోజులు విశేష పూజలు నిర్వహిస్తారు.

**జపాన్‌లో జోడీ గణపతి:**
జపాన్‌లో గణపతిని కాంగిటెన్ అని పిలుస్తారు. షాటెన్, గణాబాచి, బినాయకటెన్ ఇలా పలు పేర్లతో పిలుస్తారు. టోక్యోలో అతి పురాతన బౌద్ధ ఆలయాల్లో కాంగిటెన్ ఆలయమూ కనిపిస్తుంది. కొన్ని ఆలయాల్లో ఆడ ఏనుగు (స్త్రీ శక్తి)ను ఆలింగనం చేసుకున్న రూపంలోనూ విగ్రహాలు కనిపిస్తాయి. ఈ విగ్రహాలను పెట్టెల్లో ఉంచే సంప్రదాయం ఉంది. ఉత్సవాల సమయంలో వెలుపలికి తీసి పూజలు నిర్వహిస్తుంటారు. సంపద, ఆర్థిక విజయాలు ప్రసాదించే దైవంగా వినాయకుడిని కొలుస్తారు జపనీయులు.

**బాలిలో గణపతి భళా:**
ఇండోనేషియాలోని బాలిదీవిలో గణపతికి ఆల యాలు ఉన్నాయి. పాఠశాలలు, ప్రముఖ నిర్మాణాల్లోనూ గణపతి విగ్రహాలను ప్రతిష్ఠిస్తుంటారు. ఇండోనేషి యా కరెన్సీపై కూడా గణపతి బొమ్మను చూడొచ్చు. బాలీతో పాటు సుమత్రా దీవులు, జావా ద్వీపంలోనూ గణపతి ఆలయాలు దర్శనమిస్తాయి. వినాయక చవితితో పాటు ఇతర పర్వదినాల్లో గజాననుడికి ప్రత్యేక పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.

**థాయ్‌లో హాయిగా**
థాయ్‌లాండ్‌లో కొన్ని ఆలయాల్లో విఘ్నేశ్వరుడికి బౌద్ధ ధర్మానుసారంగా పూజలు నిర్వహిస్తుంటారు. కొన్నిచోట్ల హిందూ సంప్రదాయంలో అర్చనలు చేస్తుంటారు. థాయ్ రాజధాని బ్యాంకాక్‌లో బొజ్జ గణపయ్యకు పలు ఆలయాలు ఉన్నాయి. విజయం, శ్రేయస్సు ఆశించి పూజలు నిర్వహిస్తుంటారు. చాచోంగ్‌సావో ప్రావెన్సీలో భారీ ఆలయాలు ఉన్నాయి. దేశదేశాల నుంచి వచ్చిన పర్యాటకులు వీటిని తప్పకుండా సందర్శిస్తుంటారు. భారీ వినాయక విగ్రహాల ఎదుట ఫొటోలు దిగుతుంటారు.

**నేపాల్‌లో తంత్ర గణపతి**
నేపాల్‌లో హిందూ దేవుళ్ల ఆలయాలు కోకొల్లలు. గణపతి గుళ్లూ ఎక్కువే! అక్కడి వారు తాంత్రిక ఉపాసనలో విఘ్నేశ్వరుడిని ఎక్కువగా ఆరాధిస్తుంటారు. నేపాల్‌లోని ఆలయాల్లో కనిపించే గణపయ్య విగ్రహం కాస్త భిన్నంగా ఉంటుంది. ఏటవాలు కళ్లతో ఉంటాడు. విగ్రహం చేతుల్లో మొక్కలు ధరించి ఉండటం విశేషం. ప్రకృతి ప్రేమికులు గణపతిని పంటల దేవుడిగా భావిస్తారు.

**వినాయక పత్రం ఆరోగ్యదాయకం**
గణపతి పూజలో స్వామికి సమర్పించే ప్రతి పత్రమూ.. ఔషధ సమానమే! ప్రకృతి ప్రసాదించిన ఈ పత్రాలను దైనందిన జీవితంలో సరిగ్గా ఉపయోగించుకోగలిగితే రుగ్మతలు దరి చేరవు. విష్ణుక్రాంతం, శమీ పత్రం, గండకీ పత్రాల గుణగణాలు తెలుసుకుందాం.

**విష్ణుక్రాంత పత్రం:**
ఇది త్రిదోషాలనూ హరిస్తుంది. మానసిక ఆందోళనను తగ్గిస్తుంది. సుఖనిద్రను కలిగిస్తుంది. విషక్రాంత పత్రాల రసం.. రక్తస్రావాన్ని అరికడుతుంది. ముక్కు నుంచి రక్తం కారినప్పుడు దీనిని ఉపయోగిస్తే మంచి ఫలితం ఉంటుంది. సంధి శూల (కీళ్ల నొప్పులు) నియంత్రణకు బాగా పనిచేస్తుంది. దీని కషాయం మూత్ర సంబంధ వ్యాధులను నివారిస్తుంది.

**శమీ ప్రతం (జమ్మి ఆకు):**
కఫ, పిత్తాలను సమాన స్థాయిల్లో ఉంచుతుంది. మధుమేహాన్ని నియంత్రిస్తుంది. శరీరంలోని కొవ్వులను సమాన స్థాయిలో ఉంచుతుంది. నొప్పులు నివారిస్తుంది. బలాన్నిస్తుంది. ఈ చెట్టు బెరడులో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది.

**గండకీ పత్రం (దేవ కాంచనము):**
కఫ, పిత్తాలను సమ్యావస్థలో ఉంచుతుంది. థైరాయిడ్ సంబంధిత రుగ్మతల నివారణకు ఇది బాగా పనిచేస్తుంది. అతి స్థౌల్యాన్ని (స్థూలకాయం) తగ్గిస్తుంది. ఈ ఆకుల్లో యాంటీ డయాబెటిక్ గుణాలున్నాయి. ఈ పత్రాల రసం క్రిములను హరిస్తుంది. రక్తస్రావాన్ని అరికడుతుంది.

# ఆ ముగ్గురూ అరణ్యవాసానికి

(నిన్నటి తరువాయి)



నీకు సహకరించమన్నావు. అంటే అర్థం ఏమిటి? నీతో పాటుగా నన్నూ అరణ్యవాసానికి రమ్మనేగా! ఇప్పుడెందుకు మళ్ళీ మాట మారుస్తున్నావు?"అది కాదు నా ఉద్దేశం అన్నట్టుగా చూశాడు రాముడు."భరతుడు మరీ బాధ్యతారహితంగా ప్రవర్తిస్తాడని నేను అనుకోను. ఒక వేళ ప్రవర్తించినా, పెద్దమ్మకేమీ ప్రమాదం లేదు. వేలాది గ్రామాలు దానం చేసే పెద్దమ్మకు, మరెన్నో గ్రామాలు ఉన్నాయి. తానే పదిమందికి పెట్టగలదు. వేరొకరి సహాయసహకారాలు అక్కరలేదామెకు. అలాగే మా తల్లి కూడా హాయిగా జీవించగలదు. ఆ ఇద్దరూ తండ్రి గారిని చూసుకుంటారు. వాళ్ళని గురించి పట్టించు కోనవసరం లేదు. నా గురించి ఆలోచించన్నా! నీ దాసుణ్ణి. నువ్వు లేకుండా జీవించ లేనివాణ్ణి." అన్నాడు లక్ష్మణుడు.ఏం మాట్లాడనన్న ట్టుగా చూశాడు రాముడు."ఒక చేత గంపా, గడ్డపార పట్టుకుంటాను, ఇంకో చేత ధనుస్సు పట్టుకుంటాను. నీకు అంగ రక్షకుణ్ణవుతాను. నీకోసం పళ్ళు ఏరుకొస్తాను. కందమూలాలు తవ్వి తీసుకొస్తాను. నువ్వూ వదినమ్మా కొండల్లో విహరించే వేళల్లోనూ, రాత్రి నిద్రించే వేళల్లోనూ మిమ్మల్ని కనిపెట్టి ఉంటా నన్నా! మిమ్మల్ని కాపాడుకుంటాను. నన్ను కాదనకు" అన్నాడు లక్ష్మణుడు. మళ్ళీ రాముని పాదాలను ఆశ్రయించాడు. అప్పుడిక తప్పదనుకున్నాడు రాముడు. సీతా లక్ష్మణులు సహా అరణ్యవాసం అనివార్యం అనుకున్నాడు."తమ్ముడూ" అన్నాడు. ఆ పిలుపులో అంగీ కారం ధ్వనించిందేమో! 'అన్నా' అని ఆనందంగా లేచి నిల్చున్నాడు లక్ష్మణుడు."పద! నువ్వూ, నేనూ, సీత ముగ్గురం వనవాసదీక్ష స్వీకరిద్దాం. ముగ్గురం అరణ్యవాసానికి వెళ్తున్నట్టుగా అందరికీ చెప్పు. అలాగే..." "చెప్పన్నా""గురువుగారి పూజామందిరంలో మన మామ గారికి ప్రచేతసుడు ప్రసాదించిన రెండు పెద్ద ధనుస్సులూ, రెండు అక్షయతూణీరాలూ ఉన్నాయి. రెండు కవచాలూ, రెండు ఖడ్గాలు కూడా ఉన్నాయి. వెళ్ళి వాటిని తీసుకుని రా! ఇప్పుడవి మనకి అత్యవసరం. ఉపయోగకరం" అన్నాడు రాముడు. రాముడు చెప్పినంత సేపు పట్టలేదు, వాటితో ప్రత్యక్షమయ్యాడు లక్ష్మణుడు. తమ్ముడి హడావుడికి సన్నగా నవ్వుకున్నాడు రాముడు.

**శ్రీరామవనవాసం: దశరథునిసంతాపం**
సీతాలక్ష్మణులసహా వనవాసానికి సిద్ధమయ్యాడు రాముడు. పూజామందిరంలోని ధనుస్సులనూ, అక్షయతూణీరాలనూ, కవచాలనూ, ఖడ్గాలనూ తీసుకుని రమ్మంటే, చెప్పినంత సేపు పట్టలేదు, వాటితో ఇట్టే ప్రత్యక్షమయ్యాడు లక్ష్మణుడు. తమ్ముడి హడావుడికి సన్నగా నవ్వుకున్నాడు రాముడు. చెప్పాడిలా."నా ధనాలన్నిటినీ వేదవిదులకూ, గురువులకూ, పరిచారికులకూ దానం చేద్దామనుకుంటున్నాను. వెంటనే నువ్వు వెళ్ళి వృద్ధసూతుడు చిత్రరథుని సహా పెద్దలందరినీ పిలుచుకుని రా." లక్ష్మణుడు పరుగుదీశాడు. పెద్దలందరికీ రామాభిలాష తెలియజేశాడు. తోడుకుని వచ్చాడం దరినీ. ముందుగా వసిష్ఠుని కుమారుడు సుయజ్ఞునికి ఎదురేగాడు రాముడు."మహాత్మా! సీతాలక్ష్మణులహా నేను వనవాసానికి వెళ్తున్నాను. నాకిక ఈ రత్నకిరీటాలూ, సువర్ణహారాలూ, భుజకీర్తులూ, కుండలాలూ అనవసరం. అలాగే శత్రుంజయం అనే ఆ ఏనుగు కూడా అవ సరం లేదు. వీటిని నీకు సమర్పిస్తున్నాను. దయచేసి స్వీకరించు." అన్నాడు. చేతులు జోడించి నమస్కరించాడు."నా భార్య సీతాదేవి మణిహారాలూ, బంగారుకడియాలూ, పట్టెమంచాలు కూడా నీ భార్య కోసం స్వీకరించు." అని వేడుకున్నాడు. సమ్మతించాడు సుయజ్ఞుడు. దానాల్ని స్వీకరించాడు. ఆశీస్సులందజేశాడు వారికి. అగస్త్య, విశ్వామిత్ర నందనులను సమీపించాడు రాముడు. లక్ష్మణునితో కలసి, వారికి వేలకొలది ఆవులను దానం చేశాడు. తైత్తిరీయగురువుగారికి వేయి ఆవులను ధారపోశాడు. పరిచారికులను పిలిచి, వారికి పట్టువస్త్రాలూ, ధనాలూ, వాహనాలూ పంచి పెట్టాడు. తరలి వచ్చిన గురుకుల బ్రహ్మచారులను చూశాడు రాముడు. వారికి యాభై ఒంటెలనూ, అవి మోయగలిగినంత ధనాలూ, రత్నాలనూ, సేద్యానికి ఉపయోగపడే రెండువందల వృషభాలనూ, వేయిసంచుల్లో ధాన్యాన్నీ, వాటిని మోసే ఎద్దులసహా దానమిచ్చాడు. చేతులు కట్టుకుని నిల్చున్న చిత్రరథుణ్ణి చేర పిలిచాడు. అతనికి చాలినన్ని ధనాలూ, సువర్ణాలూ, వస్తువులనూ ఇచ్చి సంతృప్తి పరిచాడు. ఇంకా అరకొరా మిగిలితే వాటిని బ్రాహ్మణులకు దానం చేయమని లక్ష్మణుని ఆజ్ఞాపించాడు రాముడు. అన్న చెప్పినట్టుగానే దానం చేశాడతను.అడిగినవారికీ, అడగనివారికీ రాముడు అనే కంగా దానం చేస్తున్నాడంటే, త్రిజటుణ్ణి అతని భార్య పోరుపెట్టి పంపింది. పరుగెత్తికుని పడుతూ లేస్తూ వచ్చాడతను. అలసిసొలసి రాముణ్ణి సమీపించాడు.

(మిగతా రేపటి సంచికలో)

# చరిత్రలో ఆగస్ట్ 22 — పింగళి వెంకటరామారెడ్డి జయంతి

**మద్రాసు దినోత్సవం**

**1860 : నిప్కోడిస్క్‌ను కనుగొన్న పాల్ గోటిలిబ్ నిప్కో జననం.**

**1864 : మొదటి జెనీవా సదస్సులో 12 దేశాలు సంతకం చేసాయి.**

**1869 : నిజాం పరిపాలనలో పనిచేసిన పోలీసు ఉన్నతాధికారి పింగళి వెంకట రామారెడ్డి జననం (మ.1953).**

**1922 : అల్లూరి సీతారామరాజు ద్వారా మన్యం విప్లవం ప్రారంభించబడినది.**

**1932 : టెలివిజన్ ప్రసారాలను ప్రసారం చేయు మొదటి ప్రయోగాన్ని బి.బి.సి నిర్వహించింది.**

**1933 : భారతీయ నృత్యకారుడు, నటుడు గోపీకృష్ణ జననం (మ.1994).**

**1955 : తెలుగు సినిమా కథానాయకుడు, కాంగ్రెసు పార్టీ నాయకుడు చిరంజీవి జననం.(చిత్రంలో)**

**1964 : రంగస్థల నటీమణి రేకందార్ గుణవతి జననం.**

**2014 : కన్నడ రచయిత యు.ఆర్.అనంతమూర్తి మరణం (జ.1932)**



పింగళి వెంకట రామారెడ్డి (ఆగష్టు 22, 1869 - జనవరి 25, 1953) నిజాం పరిపాలనలో పోలీసు ఉన్నతాధికారి. నిజాం ప్రభువుకు విశ్వాసపాత్రులై, ప్రజలకు అనేక రంగాలలో సహాయ సహకారాలు అందించి వారి శ్రేయస్సే ప్రధానంగా సేవచేసి అపారమైన వారి ప్రేమాభిమానలను చూరగొన్న ప్రజాబంధువు. నిజాం రాజుల ఏడు తరాల రాజ్యపాలనలో హైదరాబాదు నగర పోలీసు కమీషనర్ (కొత్వాల్) పదవికి నియమితులైన మొదటి హిందువు. వీరు 1869, ఆగష్టు 22 న తాలూకాలోని ఒక చిన్న గ్రామంలో జన్మించాడు. వీరి ఇంటి పేరు పాశంవారు. తల్లిదండ్రులు కేశవరావు, జారమ్మ. ఆయన పుట్టగానే కొన్ని మాసాలకు తల్లి మరణించింది. తొమ్మిది సంవత్సరాల పాటు ఆయన బాల్యంలో రాయణిపేటలో అమ్మమ్మ కిష్టమ్మ దగ్గర పెరిగాడు. చిన్నప్పుడు ఆయన ఖాన్గీ బడిలో భారత, భాగవతాలు చదివారు. తరువాత నాలుగు సంవత్సరాలు వనపర్తి పాఠశాలలో ఉర్దూ, ఫార్సీభాషను చదువుకున్నారు. ఆ తరువాత విలియం వాహబ్ దగ్గర కన్నడ,మరాఠీ భాషలు నేర్చుకున్నాడు. నజర్ మహమ్మద్ సహాయంతో 1886లో ముదిగ్లు ఠాణాకు అమీను (సబ్ఇన్స్‌పెక్టర్)గా నియమితులైనారు. తరువాత నిజాం యొక్క సొంత ఎస్టేటు వ్యవహారాలలో ప్రత్యేకాధికారిగా కొంతకాలం వ్యవహరించారు. నిజాయితీ, సమర్థత, విధుల నిర్వహణలో చాకచక్యం కారణంగా అనతికాలంలో పదోన్నతి లభించింది. మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్, గుల్బర్గా, అత్రాఫ్ బల్దా (రంగారెడ్డి) జిల్లాలో పోలీసు అధికారిగా విధులు నిర్వహించారు. ఆ తరువాత ఆయన రాజధాని నగరం హైదరాబాద్‌లో నాయెబ్ కొత్వాల్‌గా నియమితులైనారు. అనంతరం కొత్వాల్ (సిటీ పోలీస్ కమిషనర్) అయ్యారు. వేల్సు యువరాజు హైదరాబాదు వచ్చినప్పుడు చక్కని భద్రతా ఏర్పాట్లుచేసి గుర్తింపు పొందారు. 1933 ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు. వెంకట రామారెడ్డి ఎన్నో సంస్థలను పోషించారు. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం వేమనాంధ్ర భాషా నిలయం, బాల సరస్వతి గ్రంథాలయం పురోభివృద్ధికి సహాయమందించారు. 1946లో జరిగిన 26వ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ మహాసభకు వీరు అధ్యక్షత వహించారు. హైదరాబాదులో రెడ్డి విద్యార్థి వసతిగృహం నెలకొల్పారు. తెలంగాణలో విద్యావ్యాప్తిలోనూ, రాజకీయ చైతన్యం పెంపొందించడంలోనూ రెడ్డి హాస్టల్ కీలక పాత్ర పోషించింది. హాస్టల్‌ని ప్రారంభించేందుకు గద్వాల మహారాణి, వనపర్తి రాజా, పింగళి వెంకట్రామారెడ్డి, పింగళి కోదండరాం రెడ్డి, గోపాలు పేట, దోమకొండ రాజా, జటప్రోలు రాజా తదతరుల నుంచి దాదాపు లక్ష రూపాయల వరకు చందాలు పోగుచేశారు. అలా తొలుత నగరంలో ఓ అద్దె ఇంట్లో రెడ్డి హాస్టల్‌ని ప్రారంభించారు. తర్వాత 1918లో ప్రస్తుతం అబిడ్స్‌లో ఉన్న రెడ్డి హాస్టల్ సొంత భవనంలోకి మారింది. నారాయణగూడ ఆంధ్ర బాలికోన్నత పాఠశాలకు చాలా కాలం అధ్యక్షులుగా పనిచేశారు. ఆంధ్ర విద్యాలయ కార్యవర్గానికి స్వర్గస్థులయ్యేవరకు అధ్యక్షులుగా ఉన్నారు. 1926లో "గోలకొండ పత్రిక" స్థాపనకు ముఖ్య కారకులయ్యారు. ఆ కాలంలో వీరి వలన సహాయం పొందని తెలుగు సంస్థ లేదంటే అతిశయోక్తి కాదు. హరిజనోద్ధరణకు ఏర్పడిన సంఘాలకు, అనాథ బాలల ఆశ్రమాలు, కుష్టు నివారణ సంఘం జంతు హింసా నివారణ సమితి వంటి సంస్థలతో పనిచేసి, వాటికి ఉదారంగా ధనసహాయం చేశారు. జనవరి 25 తేదీన 1953 సంవత్సరంలో పరమపదించారు.

# ప్రతిరోజూ నువ్వులు తింటే ఈ సమస్యలన్నీ హుష్‌కాకి



నువ్వులు ఆరోగ్యానికి ఎంత మంచిదో చాలామందికి తెలియదు. తెలిసినా చేదుగా ఉంటాయని కొంచెం దూరంగా పెట్టేస్తారు. వాటిని డైరక్టుగా కాకుండా రకరకాల పిండి వంటలుగా చేసుకొని తింటే రుచితోపాటు ఆరోగ్యంగా కూడా ఉంటారు. నువ్వుల పిండి, నువ్వులుండలు ఇలా ఎలా చేసుకున్నా బాగుంటుంది. మరి నువ్వులను ప్రతిరోజూ తినడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో తెలిస్తే మరింత ఇష్టం పెరుగుతుంది. ఈ రోజుల్లో ఆహారం అయితే తింటున్నారు కాని పోషకాలున్న ఆహారం తినడం లేదు. దీనివల్ల విటమిన్ల లోపానికి గురవుతున్నారు. నువ్వుల్లో ఇనుము శాతం అధికంగా ఉంటుంది. ఇది ఒకటి తింటే చాలు ఆరోగ్యంగా ఉంటారు. కరోనా బారిన పడకుండా ఉండాలంటే రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉండాలి. నువ్వుల్లో అలాంటివి పుష్కలంగా దొరుకుతుంది. రక్తహీనతతో బాధపడేవారందరికీ నువ్వులు చక్కని పరిష్కారం.


**వినాయక చవితి**

**శుభాకాంక్షలు**



అమ్మచాటు బిడ్డవైన
అద్వితీయుడు,
ముక్కోటి దేవతల మొక్కులందు
వాడు, విఘ్నాలను
ఎడబాపే
విఘ్నేశ్వరుడు,
లగ్నాలను
నడిపించే
లంబోదరుడు



– మల్లాది సోమేశ్వర శర్మ, 9603995769




తొండమునేక దంతము తోరపు
బొజ్జయు వామ హస్తమున్, మెండుగ
మ్రోయు గజ్జెలు మెల్లని చూపులు
మందహాసమున్, కొండక గుజ్జు
రూపమున కోరికన విద్యలకెల్ల నొజ్జవై
ఉండెడు పార్వతీ తనయా.. ఓయి
గణాధిపా! నీకు మొక్కదన్....

# లండన్ భామ అందాలు చూస్తే మతిపోవాల్సిందే..!!



సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన '1- నేనొక్కడినే సినిమాలోని 'లండన్ బాబు' అనే ఐటెమ్ సాంగ్ అందరికి గుర్తుండే ఉంటుంది. ఆ పాటలో చిందేసిన సోఫీ చౌదరి గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పనిలేదు. ఎందుకంటే గ్లామర్ లవర్స్ కి సోఫీ సుపరిచితమే. సారీ నుండి బికిని వరకు ఈ భామ ఎందులో అయినా ఇట్టే కుర్రాళ్లను హీటెక్కించగలదు. అయితే తెలుగులో లండన్ బాబు సాంగ్ తర్వాత మళ్లీ కనిపించలేదు. యూకే లోని మాంచెస్టర్ లో పుట్టిన ఈ భామ.. విద్యాభ్యాసం మొత్తం లండన్ లోనే పూర్తి చేసింది. అంతేగాక లండన్ అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్రామాటిక్ ఆర్ట్స్ లో గోల్డ్ మెడలిస్ట్ సోఫీ. ఇక చదువుకునే రోజుల్లోనే సోఫీ వీజే గా మారిందట. ఆ తర్వాత అక్కడే ఇండియన్ క్లాసికల్ డాన్సర్ భరతనాట్యంలో శిక్షణ తీసుకుందట. అమ్మడికి సింగింగ్ లో కూడా కాస్త ప్రావీణ్యం ఉందట. 2002లో ముంబై చేరిన సోఫీ ఎంటీవీలో నిర్వహించిన ఎంటీవీ ఇండియా ఎంటీవీ లవ్ లైన్ షోల ద్వారా వీజేగా ఫుల్ పాపులారిటీ సంపాదించుకుంది. ఆ తర్వాత 2005లో 'షాదీ నెంబర్ 1' అనే హిందీ సినిమాతో యాక్టింగ్ కెరీర్ ప్రారంభించింది. ఇక ఓ వైపు పాప్ సింగర్ గా.. మరోవైపు యాక్ట్రెస్ గా అమ్మడు బాలీవుడ్ లో ఫుల్ బిజీ అయిపోయింది. ఇక సోఫీకి సోషల్ మీడియాలో ఫుల్ ఫాలోయింగ్ ఉంది. ఈ ముప్పై ఎనిమిదేళ్ల సుందరి తాజాగా లెహంగా ధరించి ఓ ఫోటోకి పోజిచ్చింది. ఆ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. బేసిగ్గా సోఫీకి అందాలు దాచుకోవడం పెద్దగా ఇష్టం ఉండదనుకుంటా.. అందుకే తను ఎలాంటి డ్రెస్ వేసినా కుర్రకారుకు కావాల్సిన స్కిన్ షో మాత్రం ఖచ్చితంగా ముందుంచుతుంది. తాజాగా లెహంగా ధరించి కూర్చొని పైకి చూస్తున్న పోజులో అమ్మడి ఎద పొంగులన్ని బయట పెట్టేసింది. అలా సోఫీ అందాలు చూస్తూ మతి పోగొట్టుకుంటున్న ఫ్యాన్స్ లక్షలలో ఉన్నారు. ఈ లండన్ గుమ్మ మళ్లీ ఎప్పుడు తెలుగులో కనిపిస్తుందో అని ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు.

# వయ్యారాలతో సెగలు..



ఐశ్వర్య మీనన్.. అంటే సౌత్ ఇండియా ప్రేక్షకులకు బాగానే పరిచయం ఉన్నా తెలుగు ప్రేక్షకులకు మాత్రం కొత్తే. ఎందుకంటే ఈ భామ తమిళ కన్నడ మలయాళం బాషలలో సినిమాలు చేసింది కానీ ఇంతవరకు తెలుగులో సినిమా చేయలేదు. కానీ త్వరలోనే తెలుగులో కూడా ఎంట్రీ ఇవ్వనుందని టాక్ వినిపిస్తుంది. తమిళనాడులో పుట్టి పెరిగిన ఈ పాతికేళ్ల చిన్నది.. తన సొగసులను కెమెరా ముందు పరచడానికి ఏ మాత్రం సందేహించదు. పాఠశాల విద్యను భారతి విద్యాభవన్ మెట్రిక్యులేషన్ స్కూల్లో కంప్లీట్ చేసి చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నుండి ఇంస్ట్రుమెంటల్ ఇంజనీరింగ్ లో పట్టా పొందింది. అమ్మడు 2012లో 'కాధలిల్ సోదప్పువదు ఎప్పడి' సినిమాతో తమిళ ఇండస్ట్రీలో తన సినీ కెరీర్ ప్రారంభించింది. ఈ సినిమా తెలుగులో సిద్దార్థ్ హీరోగా లవ్ ఫెయిల్యూర్ పేరుతో రూపొందింది. ఇక 2013లో దసవాల సినిమాతో కన్నడ ఇండస్ట్రీలో కూడా అడుగుపెట్టింది. ఆ సినిమా ఐశ్వర్యకు మంచి పేరే తీసుకొచ్చిందట. ఇక పలు తమిళ కన్నడ సినిమాల తర్వాత 2016లో 'మాన్సూన్ మాంగోస్' సినిమాతో మలయాళ చిత్ర పరిశ్రమలోకి కూడా ప్రవేశించింది. ఇక ప్రస్తుతం అయితే ఐశ్వర్య చేతిలో తమిళ సినిమాలే ఉన్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా.. ఈ భామ ఎంత గ్లామర్ ఒలికిస్తుందో.. అదేవిధంగా సోషల్ మీడియాలో కూడా ఫ్యాన్ ఫాలోయింగ్ చాలా ఉంది. ఖాళీగా ఉంటే చాలు ఫోటోషూట్స్ చేస్తూ కొత్త కొత్త గ్లామర్ ఫోటోలు నెట్టింట పోస్ట్ చేస్తుంది. తాజాగా అమ్మడు కొన్ని అందాల ఆరబోసిన పిక్స్ పోస్ట్ చేసింది. ఆ ఫోటోలలో ఐశ్వర్య సోయగాలు చూస్తూ కుర్రాళ్ళు మతిపోయేలా ఉందంటున్నారు. కానీ ఐశ్వర్య ఎలాంటి డ్రెస్ ధరించినా సోషల్ మీడియాలో సెగలు పుట్టడం మాత్రం పక్కా అంటున్నారు. అలా ఉంటున్నాయి మరి ఈ ముద్దుగుమ్మ వయ్యారాలు.. ఫ్యాన్స్ అయితే నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఐశ్వర్య అందాలు ఐశ్వర్యం మొత్తం నెట్టింట తెగ వైరల్ అవుతోంది.

# 'ఆదిపురుష్' విలన్ సైఫ్ అలీ ఖాన్..!



బాలీవుడ్‌లో తానాజీ దర్శకుడు ఓంరౌత్.. టీ సీరీస్‌తో కలిసి టాలీవుడ్ టాప్ హీరో ప్రభాస్‌ని 'ఆదిపురుష్' అంటూ బాలీవుడ్‌లో ఓ సినిమాని చేయబోతోన్న విషయం తెలిసిందే. వన్ అఫ్ ద నిర్మాతగా ఓంరౌత్ ప్రభాస్ సినిమాలో భాగమయ్యాడు. 'ఆదిపురుష్' కథ నచ్చిన ప్రభాస్ వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం.. అది కాస్త పోస్టర్ రూపంలో ప్రకటన రావడం అన్ని కరోనా లాక్ డౌన్‌లోనే చకచకా జరిగిపోయాయి. ఈ సినిమా 300 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కబోతుంది. ప్రభాస్ రేంజ్ కి అది ఏమాత్రం ఎక్కువ కాదని నిర్మాతల నమ్మకంతోనే ఈ సినిమానికి ఇంత బడ్జెట్ పెడుతున్నారు. అయితే ఈ సినిమాలో ప్రభాస్ కి జోడిగా ప్రియాంక చోప్రా నటించవచ్చనే ఊహాగానాలు ఉన్నాయి. ఇక ఇలాంటి సినిమాలో విలన్ పాత్రపై కూడా బోలెడంత క్యూరియాసిటీ ఉంది. బాలీవుడ్ హీరోల్లోనే ఎవరైనా విలన్ గా నటించే ఛాన్స్ ఉందని అంటుంటే.. కాదు.. ఓంరౌత్ గత చిత్రం తానాజీలో నటించిన సైఫ్ అలీ ఖాన్.. ప్రభాస్ ఆదిపురుష్ విలన్ గా నటించే అవకాశం కలదు అంటున్నారు. సైఫ్ అలీ ఖాన్, ప్రభాస్?కి కూడా విలన్?గా నటిస్తే బాగుంటుందని ఓం భావిస్తున్నాడట. మొత్తం ఐదు భాషల్లో తెరకెక్కబోతున్న ఈ సినిమా పక్కా హిట్ అంటూ ప్రభాస్ ఫాన్స్ అప్పుడే సోషల్ మీడియాలో రచ్చ స్టార్ట్ చేసారు.

# ఆసక్తికరమైన టైటిల్‌తో సత్యదేవ్..



యాక్టర్ సత్యదేవ్ హీరోగా ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నాడు. ఇటు సినిమాలతో పాటు వెబ్ సిరీస్ లలోనూ కనిపిస్తూ వస్తున్నాడు. ఈ లాక్ డౌన్ టైమ్ లో సత్యదేవ్ సినిమాలకి మంచి రెస్పాన్స్ వచ్చింది. థియేటర్లు ఇంకా తెరుచుకోని కారణంగా సత్యదేవ్ హీరోగా చేసిన ఉమామహేశ్వర ఉగ్రరూపస్య ఓటీటీలో విడుదలైంది. కంచరపాలెం ఫేమ్ వెంకటేష్ మహా దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ వచ్చింది.ఓటీటీలో సినిమా విడుదలైతే హిట్టా, ఫట్టా అనేది తెలియదు. సోషల్ మీడియాలో వచ్చిన రెస్పాన్స్ ఆధారంగానే సినిమా ఎలా ఉందనేది తెలిసిపోతుంది. ఆ రకంగా చూస్తే ఉమామహేశ్వర ఉగ్రరూపస్య చిత్రం మంచి విజయం అందుకుందనే చెప్పాలి. ప్రస్తుతం సత్యదేవ్ కి మంచి డిమాండ్ ఉంది. ఇప్పటికే కొన్ని సినిమాలు లైన్లో ఉన్నాయి. అందులో తమన్నా హీరోయిన్ గా చేస్తున్న సినిమా కూడా ఒకటి. సత్యదేవ్ హీరోగా, మిల్కీ బ్యూటీ తమన్నా హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రం కన్నడలో సక్సెస్ సాధించిన లవ్ మాక్ టైల్ చిత్రానికి రీమేక్ గా వస్తుంది. రొమాంటిక్ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్న ఈ చిత్రానికి గుర్తుందా శీతాకాలం అనే టైటిల్ ని పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఆసక్తికరమైన టైటిల్ తో ప్రేక్షకులకి సులువుగా గుర్తుండే విధంగా ఉన్న ఈ టైటిల్ బాగుంటుందని ఆలోచిస్తున్నారట.



# హీట్ పెంచేస్తోన్న బ్యూటీ

విజయ్ దేవరకొండ 'నోటా' సినిమాలో నటించిన యషికా ఆనంద్ తన అందచందాలతో అభిమానులను కట్టిపడేస్తోంది. సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు హాట్ ఫొటోలు పోస్ట్ చేస్తూ హీట్ పెంచేస్తోంది. యషికా ఆనంద్ తమిళ బిగ్ బాస్ బ్యూటీ, నటి యషికా ఆనంద్ ఇన్‌స్టాగ్రామ్‌లో హీట్ పెంచేస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎప్పటికప్పుడు హాట్ ఫొటోలు పోస్ట్ చేస్తూ అభిమానులకు నయనానందాన్ని కలిగిస్తోన్న యషిక.. తాజాగా ఒక బ్యూటిఫుల్ పిక్‌ను పోస్ట్ చేసింది. ఈ ఫొటోలో యషిక క్లీవేజ్ షో ఓ రేంజ్‌లో ఉంది. ఈ ఫొటోను చూసిన అభిమానులు, ఫాలోవర్లు వాటేబ్యూటీ అంటూ ఆకాశానికి ఎత్తేస్తున్నారు. కొంత మంది అయితే అసభ్యకరంగా కూడా కామెంట్లు పెడుతున్నారనుకోండి. హీరోయిన్లకు ఇలాంటి కామెంట్లు ప్రస్తుతం సర్వసాధారణమైపోయాయి. ఇన్‌స్టాగ్రామ్ మోడల్‌గా కెరీర్ మొదలుపెట్టిన ఈ ఢిల్లీ బ్యూటీ.. తమిళ సినీ పరిశ్రమ ద్వారా వెండితెరకు పరిచయమైంది. 14 ఏళ్ల వయసులోనే హీరోయిన్‌గా ఛాన్స్ కొట్టేసింది. 2015లో 'ఇనిమే ఇప్పడితన్' అనే సినిమాలో సంతానం పక్కన నటించింది. కానీ, తరవాత ఈ సినిమా నుంచి ఆమెను తొలగించారు. సాంగ్ షూట్‌కు హాజరుకాలేదనే కోపంతో మేకర్స్ ఈమె పాత్రను తప్పించారు. దీంతో 2016లో వచ్చిన 'కవలాయి వేండమ్' సినిమాతో వెండితెరకు పరిచయమైంది యషిక. జీవా, కాజల్ హీరోహీరోయిన్లుగా వచ్చిన ఈ సినిమాలో యషిక స్విమ్మింగ్ ట్యూటర్ పాత్ర పోషించింది.

# నితిన్ రీమేక్ సినిమాకి ఇస్మార్ట్ భామ..?



భీష్మ సినిమాతో హిట్ అందుకున్నాక నితిన్ మంచి జోరుమీదున్నాడు. ప్రస్తుతం నితిన్ చేతిలో నాలుగు సినిమాలున్నాయి. అందులో బాలీవుడ్ అంధాధున్ తెలుగు రీమేక్ కూడా ఒకటి. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చిత్రబృందం నటీనటులని ఎంపిక చేసే పనిలో చాలా బిజీగా ఉంది. ఈ కరోనా సమయాన్ని పూర్తిగా దానికే వెచ్చిస్తుంది. అంధాధున్ చిత్రంలో టబు పోషించిన పాత్రలో ఎవరిని తీసుకోవాలా అని సతమతమవుతున్న టైమ్ లో రాధికా ఆప్టే చేసిన పాత్రకి హీరోయిన్ దొరికిందని అంటున్నారు. ఇస్మార్ట్ శంకర్ సినిమాతో ఒక్కసారిగా వెలుగులోకొచ్చిన కన్నడ భామ నభా నటేష్ ని హీరోయిన్ గా తీసుకోవాలని అనుకుంటున్నారట. ఆ పాత్రలో నభా నటేష్ అయితే బాగుంటుందని భావిస్తున్నారట. మరి నభా నటేష్ ఒప్పుకుంటుందా లేదా చూడాలి. ప్రస్తుతం నభా, సాయి ధరమ్ తేజ్ సినిమా సోలో బ్రతుకే సో బెటరు చిత్రంలో కనిపించనుంది. ఇంకా వరుణ్ తేజ్ సరసన స్పోర్ట్స్ డ్రామాలో చేయనుందని ప్రచారం జరిగింది. ఇప్పుడు ఈ సినిమా కూడా ఓకే అయితే ఆమె కెరీర్ కి బాగా ప్లస్ అవుతుంది. చూడాలి మరేం జరగనుందో..

# చిన్న సినిమాకు పెద్ద సపోర్ట్..




క్రమంగా చిన్న సినిమాలకు ఆధరణ పెరుగుతోంది. స్టార్ హీరోలు, దర్శకనిర్మాతలు వారి వారి సపోర్ట్ అందిస్తున్నారు. ఈ క్రమంలోనే 'రాధాకృష్ణ' మూవీ ఫస్ట్ సింగిల్ విడుదల చేయబోతున్నారు డైరెక్టర్ పూరిజగన్నాథ్. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నిర్మల్ బొమ్మ కాలక్రమేణా ప్లాస్టిక్ బొమ్మల తాకిడికి, కుదుపులకు లోనైంది. ఈ నేపథ్యంలో ఒక గొప్ప సందేశాత్మక ప్రేమకథగా రూపొందుతోన్న చిత్రం 'రాధాకృష్ణ'. ప్రముఖ దర్శకుడు ఢమరుకం ఫేమ్ శ్రీనివాసరెడ్డి సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. అనురాగ్, పైసా వసూల్ ఫేమ్ ముస్కాన్ సేథీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి టి.డి. ప్రసాద్ వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. హరిణి ఆరాధ్య క్రియేషన్స్, శ్రీ నవహాస్ క్రియేషన్స్ పతాకాలపై పుప్పాల సాగరిక, కృష్ణ కుమార్‌లు నిర్మిస్తున్నారు. ఇటీవల చిత్ర నిర్మాణ సారథి పుప్పాల కృష్ణ కుమార్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన 'రాధాకృష్ణ' ఫస్ట్‌లుక్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఇటీవల విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌కి వచ్చిన రెస్పాన్స్ చాలా బాగుంది. అలాగే రాధా కృష్ణ ఫస్ట్ సింగిల్‌ను ఇస్మార్ట్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ గారు ఆగస్ట్ 22న విడుదల చేయనున్నారు. డమరుకం ఫేమ్ శ్రీనివాసరెడ్డి గారి సమర్పణలో అందరినీ ఆకట్టుకునే విధంగా ఈ చిత్రం రూపొందుతోంది" అన్నారు. అలీ, కృష్ణ భగవాన్, అన్నపూర్ణమ్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో సంపూర్ణేష్ బాబు ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. చిత్రానికి సురేందర్ రెడ్డి సినిమాటోగ్రఫీ చేస్తుండగా, ఎం.ఎం. శ్రీలేఖ సంగీతం సమకూర్చుతున్నారు.

# లేటు వయసులో వహ్వా..



ఇటీవలి కాలంలో లేటు వయసు ఘాటు వ్యవహారాలు సోషల్ మీడియా సాక్షిగా బయటపడుతుంటే వాటికి కొంటె కుర్రాళ్ల కామెంట్లు అంతే ఇదిగా వేడెక్కిస్తున్నాయి. 40 ఏజ్‌కి చేరువలో ఉన్న అమీషా పటేల్.. శిల్పా శెట్టి.. ప్రీతిజింతా లాంటి భామలు నిత్యం ఏవో వేడెక్కించే ఫోటోలతో అంతర్జాలంలో అగ్గి రాజేస్తూనే ఉన్నారు. తాజాగా సొట్ట బుగ్గల సుందరి ప్రీతిజింతా అదిరిపోయే ఫోజును ఇన్ స్టాలో షేర్ చేసింది. ఈ ఫోటో ప్రస్తుతం కుర్రకారులో హాట్ టాపిక్ గా మారింది. నవ్వకుండానే అలా బుగ్గల్లో సొట్టలు పడిపోతుంటే.. అసలు ఆ డిజైనర్ డ్రెస్ కలర్ కాంబినేషన్ అదరహో అనేలా ఉంది అంటూ పొగిడేస్తున్నారు. బిగి సడలని బరువులతో జింతాత జితాత అంటూ ఏమిటా ఫోజు? అంటూ ఒకటే ఇదైపోతున్నారు. ఇంతకీ ఈ ఫోటోషూట్ ఎక్కడ చేశారు? అంటే వెర్సాస్ ఫోటోషూట్ అంటూ స్పందించింది ప్రీతి. హ్యాట్ 24 లైవ్ అనే బ్రాండెడ్ ఫ్యాషన్ గార్మెంట్స్.. అలానే సౌందర్య సాధక ఉత్పత్తులకు ప్రచారకర్తగా ఎంపికైంది. అందుకే ఈ హడావుడి. కెకెఆర్ టీమ్ తో బిజినెస్ ఉండీ.. ఐపీఎల్ లో ప్రీతి హడావుడి లేకపోతే ఏదో అయిపోతున్నారు కుర్రాళ్లు. అసలు మాయదారి మహమ్మారీ ఇలా నాశనం చేసింది కానీ లేదంటే ఐపీఎల్ పేరుతో ఇలాంటి సీనియర్ బ్యూటీస్ స్టేడియంలో ఉరకలెత్తిస్తుంటే ఆ మజానే వేరుగా ఉంటుంది.

## తిరుపతి, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు వార్తలు

# వెలుగు సిసి మధుసూదన్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి



**కె.వి పల్లి, వార్తావళి, ఆగస్ట్ 21:** చిత్తూరు జిల్లా కె.వి పల్లి మండలం, వెలుగు సిసి మధుసూదన్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని, విధుల నుండి తొలగించాలని, బాధిత బీసీ మహిళ మాధవి గారికి సత్వర న్యాయం జరగాలని, దిశ కేసు వచ్చేలా చర్యలు తీసుకోవాలని... అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ.. ఈరోజు భారతీయ అంబేద్కర్ సేన బాస్ ఆధ్వర్యంలో... సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బీసీ సంఘాలుయాదవ సంఘం, వాల్మీకి హక్కుల పోరాట సమితి, రాష్ట్ర చేనేత సంఘాలు, బీసీ విద్యార్థి సంఘాలు, రాయలసీమ విద్యార్థి సంఘాలు, పీలేరు నియోజకవర్గ ఎస్సీ ఎస్టీ బీసీ సంఘాలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. మాధవి గారికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని తెలియజేశారు.



ఇఎస్ఐ హాస్పిటల్ వద్ద కోవిడ్ రిషిప్షన్ కౌంటర్ ను ప్రారంభిస్తున్న తిరుపతి ఎమ్మెల్యే శ్రీ భూమన కరుణాకర్ రెడ్డి తుడా చైర్మన్ మరియు ప్రభుత్వ విప్ శ్రీ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ., జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణ భరత్ గుప్తా ., జెసి (డి) శ్రీ వీరబ్రహ్మం తదితరులు.

– వార్తావళి, తిరుపతి

# నిన్ను వదిలే ప్రసక్తే లేదు

### శ్రీకాంత్ రెడ్డిపై టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస రెడ్డి ఫైర్



**కడప, వార్తావళి, ఆగస్ట్ 21:** నీటి పారుదల విషయంలో నీవు మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నావు. నువ్వు చెప్పే సొల్లు కబుర్లు వినేందుకు మేము ఏమన్నా చెవ్వులో పూలు పెట్టుకున్నామని భ్రమ పడ్తున్నవా హంద్రీనీవా నుండి వెలిగల్లు ప్రాజెక్ట్ కు అను సంధానం చేసే కాలువ పనికి 5-10-2015 వ తేదీన టెండర్ నోటీస్ మా ప్రభుత్వం హయాంలో ఇవ్వడంమరియు ఆ పనిని పూర్తి చేయడం జరిగనది. నేను ఈ విషయంలో అన్ని ఆధారాలతో సహా నిరూపిస్తా,అది కాదని చెప్పగలిగే దమ్ము, ధైర్యం నీకున్నదా? నిజానికి వెలిగల్లు ప్రాజెక్ట్ మా తండ్రి దివంగత మాజీ మంత్రి వర్యులు శ్రీ ఆర్.రాజగోపాల్ రెడ్డి గారి ఆశయం, ఆలోచనతో రూపు దిద్దుకున్న ప్రాజెక్ట్... ఆ తరువాత మా సోదరుడు మాజీ శాసనసభ్యుడు శ్రీ ఆర్.రమేష్ రెడ్డి గారు దానిని అమలు చేయడం జరిగింది.ఇందులో నా కృషి కూడా ఎంతో ఉన్నది... పిన్ను సూది నుండి విమానం వరకు ఏ హామీ అయిన గుమ్మరించడం ఆ తరువాత వాటిని విస్మరించడము మరియు అక్రమ వ్యాపారాలు,బ్రోకెరైసులు, మోసాలు, చిల్లర రాజకీయాలు చేయడం నీకు వెన్నతో పెట్టిన విద్య.. పిల్లి పాలు తాగుతూ ఎవ్వరు చూడలేదనుకునట్లు ,నువ్వు చేసిన అవినీతి, పైరవీలు, దందాలు అన్ని జగమెరిగిన నగ్న సత్యమే.వాటినన్నిటిని ఆధారాలతో సహా నేను త్వరలో నీ బండారం బయటపెడ్త. అధికార గర్వంతో, అహంకారం తో విర్రవీగి మాట్లాడుతున్నావు. కాచుకుని ఉండు. నిన్ను వదిలే ప్రసక్తే లేదు.

# ఆటోను ఢీకొన్న లారీ

**చిలమత్తూరు, వార్తావళి, ఆగస్ట్ 21:** మండలంలోని కోడూరు తోపులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు కోడూరుతోపులో పుట్టపర్తికి తిరిగే మలుపు వద్ద అనంతపురం నుంచి బెంగళూరు వెళుతున్న సిమెంట్ లారీ ఓ ఆటోను ఢీకొంది. ప్రమాదంలో మూర్తి అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

**పొలాల్లోకి దూసుకెళ్లిన కారు**

అగళి: మండలంలోని ఇరిగేపల్లి సమీపంలో శిరా నుంచి వస్తున్న కారు గురువారం రాత్రి పంట పొలాల్లో దూసుకెళ్లింది. ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న ఎంఎం.పాళ్య గ్రామానికి చెందిన చంద్ర, శ్రీనివాస్ గాయాలకు గురయ్యారు. వీరు శిరా నుంచి కారులో వస్తుండగా ఇరిగేపల్లి సమీపంలోని ఐ.గొల్లహట్టి క్రాస్ వద్ద ప్రమాదానికి గురయ్యారు. క్షతగాత్రులను వైద్యం కోసం శిరా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్ఐ ఖలీల్‌బాషా తెలిపారు.

# డీఈఈ మురళీమోహన్ మృతి

**అనంత, వార్తావళి, ఆగస్ట్ 21:** నగరపాలక సంస్థలో డీఈఈగా పనిచేస్తున్న మురళీ మోహన్ మృతి చెందారు. ఆయన ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. కరోనా లక్షణాలతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆయన భౌతికకాయాన్ని దర్శించి నివాళు లర్పించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు మురళీమోహన్ మృతి బాధాకరమని కమిషనర్ పీవీవీఎస్ మూర్తి పేర్కొన్నారు.

# నా జీవితం తెరిచిన పుస్తకం...

### నన్ను వదలను, కాచుకో అంటున్నావు... ఎదురు చూస్తుంటా...

### శ్రీనివాసులు రెడ్డి విమర్శలపై ధ్వజమెత్తిన ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్ రెడ్డి



**కడప, వార్తావళి, ఆగస్ట్ 21:** రాజకీయంగానూ, నిజ జీవితం లోనూ నా జీవితం ఎప్పుడూ తెరిచిన పుస్తకం అని ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. జిల్లా టి డి పి అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్ రెడ్డి ధ్వజమెత్తారు.నన్ను వదిలే ప్రసక్తే లేదని,కాచుకో అని చౌకబారు ఆరోపణలు చేయడం నీ రాజకీయ మిడిమిడి జ్ఞానాన్ని తెలియపరుస్తోందన్నారు. నన్ను వదలనంటున్నావు, కాచుకో నంటున్నావు అందుకు నేనెప్పుడూ సిద్ధమే ఎదురు చూస్తుంటానన్నారు. నీటి పారుదల విషయంలో నాకు మిడిమిడి జ్ఞానం ఉందని మాట్లాడావు..నాకు మీ అంత జ్ఞానం లేక పోవచ్చేమో... మీరు పెద్ద జ్ఞాన వంతులు కదా 2009 నుంచి 2019 వరకు అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకుని ఒక ప్రక్క కిరణ్ కుమార్ రెడ్డి కి బినామీగా, 2014 నుంచి లోకేష్ బాబు కు బినామీ గా ఉంటూ నియోజక వర్గానికి ప్రత్యేకంగా ఏమి అభివృద్ధి చేసావో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.వెలిగల్లు కాలువ లీకేజీలను పూడ్చడం, మరమ్మత్తు పనుల కోసం టెండర్లు జరిగితే అవినీతి అన్నావు ...ఇప్పుడు అధికారులు పూర్తి వివరాలు తెలుపుతుంటే నోరు మెదపలేకున్నావన్నారు.నాకున్న మిడి మిడి జ్ఞానంతోనే 2008 డిసెంబర్ మాసంలో వెలిగల్లు ప్రారంభానికి వై ఎస్ ఆర్ వచ్చినప్పుడు నేను ఎంఎల్ఏ కాకపోయినా ఇక్కడి రైతుల పరిస్థితులను వివరించి వెలిగల్లుకు హెచ్ ఎన్ ఎస్ ఎస్ లింక్ అప్ చేయాలని విన్నవించామన్నారు. వై ఎస్ ఆర్ వెంటనే జి ఓ ఆర్ టి నెంబర్ 905, 22-12-2008 తేదీన జి ఓ ను విడుదల చేశారన్నారు. ఆ జి ఓ ను కూడా వాట్స్ అప్ ద్వారా తెలియచేస్తున్నామన్నారు. రూ.7.20 కోట్లుతో పరిపాలన అనుమతులు వచ్చాయన్నారు. ఆ టెండర్ ను నీవు పొంది ఏడేళ్లు గడిచినా పనులు చేయక పోతే అది రీటెండర్ పిలిచిన విషయం మరిచారా అని ఆయన ప్రశించారు. నీకింతవరకు రాజకీయంగా అవగాగన ఉందని అనుకున్నా ..మీ ఆరోపణలును చూస్తుంటే అవగాహన లేనట్లుగా ఉందని అర్ధమవుతోందన్నారు.వెలిగల్లు ప్రాజెక్ట్ నిర్మించాలన్నది మీ తండ్రి గారు కలలు కన్నది వాస్తవమని, మీతండ్రి గారికున్న హుందాతనం, ఆలోచనలు మీకు లేకపోవడం బాధాకరమన్నారు.రూ.5500 కోట్ల నిధులతో హెచ్ ఎన్ ఎస్ ఎస్ , జి ఎన్ ఎస్ ఎస్ లింక్ లతో అన్ని చెరువులను నీటితో నింపేందుకు నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల లోని ప్రతి చెరువుకు లిఫ్ట్, గాలివీడు లోని అన్ని చెరువులకు , సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి మండలం కంచాలమ్మ గండి వరకు అన్ని చెరువులను నీటితో నింపి రైతన్నల కలల సాకారానికి కృషి చేస్తున్నామన్నారు. మీకున్న అద్భుతమైన మేధస్సుతో ఏమి అభివృద్ధి చేశారని ఆయన ప్రశించారు.ఇక్కడకు రావాల్సిన నీటిని కుప్పం కు తరలించడం మీ జ్ఞానమా అని ఆయన నిలదీశారు.కుట్ర రాజకీయాలు చేయడం నాకు చేత కాదు.. నేను అవినీతికి పాల్పడినట్టు నియోజక వర్గంలో ఎక్కడైనా నిరూపించినా రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. తామెప్పుడూ కూడా ప్రజలతో సత్సంబంధాలు పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నామన్నారు. అధికార గర్వం,అహంకారం ఎప్పటికీ మా దరిదాపుల్లోకి ఉండవన్నారు. అవినీతి, అహంకారాలకు మారు పేరు మీరన్నది తెలుసుకో, రాజకీయాలలో హుందాగా వ్యవహరించడం నేర్చుకో, ఉనికి కాపాడుకోవడం కోసం నిరాధార ఆరోపణలు చేయడం మానుకో, నియోజకవర్గంలో జరుగుచున్న అభివృద్ధి,ఇరిగేషన్ పనులను స్వాగతించడం నేర్చుకో అని ఆయన హితవు పలికారు. ఎప్పుడూ కూడా ఎదుటి వారిపై ఆరోపణలు చేసేటప్పుడు నిజా నిజాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందన్నారు. మా పార్టీ అధికారం లోకి వచ్చిన ఏడాదిలోగానే ఎన్ని హామీలను నెరవేర్చానో ప్రజలకు తెలుసన్నారు.

# పెను ప్రమాదం తప్పింది



**చిత్తూరు, వార్తావళి, ఆగస్ట్ 21:** పాల ఫ్యాక్టరీలో జరిగిన దుర్ఘటన ఇబ్బందికరమైన దని జిల్లా కలెక్టర్ మరియు ఎస్.పి సకాలంలో స్పందించడంతో పాటు ఇతర అధికారులను అలర్ట్ చేయడంతో పెను ప్రమాదం తప్పిందని మొత్తం 14 మంది బాధితులు కోరుకుంటున్నారని వీరిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు పూతలపట్టు శాసనసభ్యులు ఎం ఎస్ బాబు అన్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 11 మంది బాధితులను చికిత్స అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు ఉన్నత వైద్యం కావాలంటే ఇతర ఆసుపత్రికి పంపి అందిస్తామని ఆయన చెప్పడం జరిగింది. కాగా గురువారం రాత్రి ముగ్గురు పరిస్థితి ఇబ్బందికరంగా ఉండటంతో వారిని తిరుపతికి తరలించారు. అనంతరం ఏ ఎం ఎస్ బాబు పూతలపట్టు మండలం లో గల బండపల్లి వద్ద దుర్ఘటన జరిగిన పాల ఫ్యాక్టరీని పరిశీలించారు. యాజమాన్యం తరపున ఉన్న ప్రతినిధులను సంఘటన జరిగిన తీరు గురించి విచారించారు. సంఘటనలో గాయపడిన వారికి ఐదు లక్షల రూపాయల నష్ట పరిహారం ఇవ్వడం జరుగుతుందని ఈ సంఘటనపై ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విచారం వ్యక్తం చేయడమే కాక వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు జిల్లా కలెక్టర్ ఇప్పటికే జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మరియు అగ్నిమాపక దళానికి చెందిన అధికారులను విచారణ కమిటీగా నియమించారని వారు ఇచ్చే నివేదిక పై తగు చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. దుర్ఘటన స్థలాన్ని ఎమ్మెల్యే ఎం ఎస్ బాబు తో పాటు చిత్తూరు ఆర్డీవో రేణుక మాజీ జడ్పీ చైర్మన్ కుమార్ రాజా బంగారుపాలెం సింగిల్విండో చైర్మన్ దత్తాత్రేయ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు

# పంట నష్టం వివరాలు తేల్చండి



**కాకినాడ, వార్తావళి, ఆగస్ట్ 21:** వరద ఉద్ధృతి తగ్గుతున్న నేపథ్యంలో వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాన్ని వెంటనే అంచనా వేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ డి.మురళీధర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఆయన సంయుక్త కలెక్టర్లు లక్ష్మీశ, రాజకుమారి, డీఆర్వో సత్తిబాబుతో కలిసి మండల, డివిజన్‌స్థాయి అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. పంట నష్టాలపై క్షేత్రస్థాయికి వెళ్లి పది రోజుల్లో అంచనాలు రూపొందించాలన్నారు. వరద తగ్గుతున్న నేపథ్యంలోచేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ముంపునకు గురైన ఇళ్లను గుర్తించి, ఆ కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.2వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. అమలాపురం డివిజన్‌లోని లంక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సహాయ, పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. ముంపుబారిన పడిన 140 గ్రామాల్లో విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. ఇళ్ల స్థలాల పంపిణీకి అవసరమైన భూసేకరణ పూర్తయిందని, లే-అవుట్లు నూరుశాతం పూర్తి చేయాలన్నారు. లే-అవుట్లను ఎత్తు చేయడానికి గ్రావెల్ తరలింపునకు అనుమతించామన్నారు. ఇప్పటికే మండలాలకు ఇళ్ల పట్టాలను తరలించామన్నారు. సమీక్షలో జడ్పీ సీఈవో ఎం.జ్యోతి, డీపీవో నాగేశ్వర్‌నాయక్ , గృహనిర్మాణ సంస్థ పీడీ వీరేశ్వరప్రసాద్, వ్యవసాయశాఖ జేడీ కేఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పాలకులే అభివృద్ధిని అడ్డుకోవడం ఎక్కడైనా ఉందా..?

### తెదేపా జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

**గుంటూరు, వార్తావళి, ఆగస్ట్ 21:** పాలకులే అభివృద్ధిని అడ్డుకోవడం, నాశనం చేయడం ఎక్కడైనా ఉందా.. అని తెదేపా జిల్లా అధ్యక్షుడు జి.వి.ఆంజనేయులు నిలదీశారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. 'ఈ ప్రాంతానికి జగన్ ఇంత అన్యాయం చేస్తుంటే గుంటూరు, కృష్ణా జిల్లాల వైకాపా నేతలకు కనీసం చీమ కుట్టినట్లు కూడా లేదు. రూ.కోట్లు వెచ్చించి అసెంబ్లీ, సచివాలయం నిర్మిస్తే దుర్వినియోగం చేస్తారా? మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ఉద్యోగుల కోసం భవన నిర్మాణాలు సగానికి పైగా పూర్తయ్యాయి. ఉన్నవాటిని ఉపయోగించుకోవడం చేతగాక ఇంకెక్కడో ఏదో చేస్తామని మంత్రులు మాట్లాడటం సరికాదు. అమరావతి ఆగిపోవడంతో లక్ష మంది కూలీలు రోడ్డున పడ్డారు. వారి ఆకలి బాధలు ప్రభుత్వానికి పట్టడం లేదు. మూడు రాజధానులంటూ అభివృద్ధిని నాశనం చేయొద్దు కక్ష సాధింపులకు స్వస్తి పలికి అమరావతితో పాటు అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయండి. లేదంటే భవిష్యత్తు తరాలు క్షమించవు'.. అని హితవు పలికారు.

# ఇళ్ల స్థలాల కేటాయింపునకు భూ పరిశీలన



**తాడిపత్రి, వార్తావళి, ఆగస్ట్ 21:** తాడిపత్రి పురపాలికలోని పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వ భూమిని పరిశీలించేందుకు కలెక్టర్ గంధం చంద్రుడు యర్రగుంటపల్లి గ్రామానికి వచ్చారు. పట్టణంలోని ఇళ్ల స్థలాలు లేని వారికి కావాల్సిన భూమి పట్టణంలో లేకపోవడంతో యర్రగుంటపల్లి గ్రామంలోని 18 ఎకరాల ప్రభుత్వ భూమిని కలెక్టర్ పరిశీలించారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, పురపాలిక కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, తహసీల్దారు నయాజ్ అహమ్మద్, సీఐలు అస్రార్ బాషా, తేజమూర్తి తదితరులు ఉన్నారు. భూగర్భ మురుగునీటి వ్యవస్థను పూర్తిచేసి ఇక్కట్లు తొలగిస్తామని కలెక్టర్ గంధం చంద్రుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న భూగర్భ మురుగునీటి వ్యవస్థను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డితో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం చాగల్లు జలాశయ పరిధిలోని పెద్దయక్కలూరు గ్రామాన్ని సందర్శించి ఎస్సీ కాలనీలో ఇళ్ల సమీపంలో ఊట జలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో తహసీల్దారు నాగభూషణం, ఎంపీడీవో ప్రభాకర్, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

### సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



**తాడిపత్రి, వార్తావళి, ఆగస్ట్ 21:** లారీ, ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి దుర్మణం పాలైన ఘటన తాడిపత్రి పట్టణంలో జరిగింది. పట్టణ సీఐ తేజమూర్తి తెలిపిన వివరాల మేరకు.. పుట్టపర్తి మండలం ఎనుమలపల్లి గ్రామానికి చెందిన కుమ్మర మల్లికార్జున (42) అనే వ్యక్తి పెద్దపప్పూరు మండలం నరసాపురం గ్రామంలో వ్యవసాయం చేస్తున్నారు. నాలుగు రోజుల కిందట నరసాపురానికి వచ్చి వ్యవసాయ పనులు ముగించుకుని యల్లనూరు మండలం కల్లూరు గ్రామానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. తాడిపత్రి పట్టణంలోని పెద్దపప్పూరు హైవే మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. ఈ ఘటనలో మల్లికార్జున అక్కడికక్కడే మృతిచెందారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# విజృంభిస్తున్న వైరస్

**అనంతపురం, వార్తావళి, ఆగస్ట్ 21:** జిల్లాలో కరోనా మహమ్మారి విస్తరిస్తూనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బులెటిన్ ప్రకారం మరో 973 మందికి పాజిటివ్ నిర్ధరణ అయింది. ఎనిమిది మంది మృతి చెందారు. 5088 మంది నమూనాలు పరీక్షించగా.. 973 మందికి పాజిటివ్ వచ్చింది. ప్రతి వంద మందిలో 19.12 శాతం మందికి కరోనా సోకింది. మొత్తం బాధితుల సంఖ్య 32,603, మృతుల సంఖ్య 254కి చేరింది. ఇంకా 5795 మంది వైద్య చికిత్స పొందుతున్నారు. గురువారం 813 మంది ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి అయినట్లు కలెక్టర్ చంద్రుడు తెలియజేశారు.

అనంతలో ఎక్కువ

ప్రకటించిన 973 మందిలో.. అనంత నగరంలో 194 మంది బాధితులు ఉన్నారు. యాడికిలో 95, తాడిపత్రి 72, ధర్మవరం 53, గార్లదిన్నె 44, పెద్దవడుగూరు 41, హిందూపురం 38, పుట్టపర్తి 32, గుంతకల్లు, రొద్దం 29 మంది చొప్పున, చిలమత్తూరు 28, బెళుగుప్ప 27, ఉరవకొండ 23, బుక్కపట్నం 17, బత్తలపల్లి, పెద్దపప్పూరు, రామగిరిలో 16 ప్రకారం, కళ్యాణదుర్గం 15, శింగనమల 14, పుట్లూరు 13, తాడిమర్రి 12, గుత్తి, పెనుకొండలో 11 మంది... ఇలా 52 ప్రాంతాల్లో కొత్త కేసులు నమోదు అయ్యాయి.

# అనుమానంతో భార్యను కడతేర్చిన భర్త

### మృతి చెందిన లలిత



**ధర్మవరం, తాడిపత్రి, వార్తావళి, ఆగస్ట్ 21:** అనుమానం పెంచుకున్న భర్త రోకలిబండతో దాడి చేయడంతో లలిత(32) అనే వివాహిత మృతి చెందింది. ధర్మవరం మండలం తుంపర్తి గ్రామ సమీపంలోని ఒక తోటలో ఈ ఘటన జరిగింది. స్థానికులు, ధర్మవరం గ్రామీణ పోలీసుల కథనం మేరకు బుక్కపట్నం మండలం పి.కొత్తకోటకు చెందిన భార్యాభర్తలు లలిత, జయరామ్ తోటలో పనిచేసేందుకు మూడు రోజుల క్రితం తుంపర్తికి వచ్చారు. ఉదయం రోకలిబండతో లలితను జయరామ్ కొట్టడంతో ఆమె తలకు బలమైన గాయం తగిలింది. ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ లలిత మృతి చెందింది. లలిత తల్లిదండ్రులు గంగాద్రి, కేశమ్మ కొంతకాలంగా ఇదే తోటలో పనిచేస్తున్నారు. అందుకనే వారు కూడా ఇక్కడికి వచ్చారు. అనుమానంతో రోకలిబండతో జయరామ్ దాడి చేయడంతో ఆమె మృతి చెందిందని తండ్రి గంగాద్రి ధర్మవరం గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామీణ సీఐ చిన్నపెదయ్య, ఎస్ఐ జనార్దన్‌నాయుడు, జయరామ్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

# విశాఖ రూరల్



## ఉత్తమ పోలీస్ అధికారులకు శిష్టకరణం సంఘం ఆధ్వర్యంలో సన్మానం

**కొత్తవలస, వార్తావళి, ఆగస్ట్ 21:** ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ పోలీస్ అధికారులు గా ప్రశంసలు పొందిన రెండవ పట్టణ ఎస్సైలు నారాయణ రావు, వాసుదేవ రావులకు విజయనగరం జిల్లా కరణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం పి జి ఈశ్వరరావు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు ముందుగా సుమారు మూడు వందల మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సందర్భంగా ఎస్సై లో నారాయణరావు ,వాసుదేవరావు మాట్లాడుతూ రానున్న కాలంలో నీరు కలుషితం కాకుండా ఉండాలంటే తప్పనిసరిగా మట్టి వినాయకులను పూజించాలి అన్నారు ప్రస్తుతం కరోనా వైరస్ కారణంగా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు తప్పనిసరిగా బౌతిక దూరం పాటించాలని బయటకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా మాస్క్ ఉండాలన్నారు అదేవిధంగా వినాయక ఉత్సవాలను ప్రతి ఒక్కరు తమ ఇళ్లలో భౌతిక దూరం పాటిస్తూ జరుపుకోవాలి అన్నారు ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించిన విజయనగరం జిల్లా శిష్టకరణ సంఘ ప్రధాన కార్యదర్శి ఎం పి జి ఈశ్వరరావు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నా%శీ% అని అన్నారు అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం పి జి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ పై ప్రతి ఒక్కరూ పోరాటం చేస్తున్నారని ఇటువంటి సందర్భంలో వారి ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులను నిర్వహించి ఉత్తమ పోలీస్ అధికారులు గా పేరు ప్రఖ్యాతులు పొందిన ఎస్సైలు నారాయణ రావు వాసుదేవ రావులకు విజయనగరం జిల్లా శిష్టకరణం సంఘం తరపున ప్రత్యేక అభినందనలు తెలుపుతున్న మన్నారు రానున్న కాలంలో వీరు మరెన్నో ఉత్తమ అవార్డులు పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు బాలు పట్టణ ఉపాధ్యక్షులు మరుపల్లి ప్రతాప్ కుమార్, బి రాజేష్ ,మరుపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



**పూసపాటిరేగ, వార్తావళి, ఆగస్ట్ 21:** మాజీ కేంద్రమంత్రి వర్యులు, పద్మభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి గారి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా విజయనగరం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు,జనసేన పార్టీ నాయకులు త్యాడ రామకృష్ణారావు (బాలు) ఆధ్వర్యంలో పట్టణంలో ఇప్పిలివీధి, చిన్నఅంజనేయ స్వామి గుడివద్ద పలువురు పారిశుద్ధ్య కార్మికులకు సత్కరించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులు ఇచ్చారు. ఈసందర్భంగా బాలు మాట్లాడుతూ మహమ్మారి కరోనా వలన లాక్ డౌన్ సమయంలో పారిశుద్ధ్య కార్మికుల ప్రాణాలు,ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా వెలకట్టలేనంత సేవలు చేశారు. అటువంటి పారిశుద్ధ్య కార్మికులకు ఈ సందర్భంగా సత్కరించు కోవడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు. అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షులు శ్రీ రవణం స్వామి నాయుడు గారి సారధ్యంలో జిల్లా చిరంజీవి యువత ఆధ్వర్యంలో మరెన్నో సేవకార్యక్రమాలతో ముందుకెళ్తామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా చిరంజీవి యువత ప్రతినిధులు పిడుగు సతీష్, కొయ్యాన లక్ష్మణ్ యాదవ్,నారంసెట్టి వెంకటరమణ,ఏంటి రాజేష్,దాసరి యోగేష్, పళ్లెం కుమారస్వామి, లోపింటి కళ్యాణ్,సాయి,కులదీప్ పాల్గొన్నారు.

## 22న చిరంజీవి జన్మదిన వేడుకలు



**పూసపాటిరేగ, వార్తావళి, ఆగస్ట్ 21:** మెగాస్టార్ పద్మభూషన్ డా॥ చిరంజీవిగారి జన్మదిన వారోత్సవాలు సందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షులు ఆర్.స్వామినాయుడు పిలుపు మేరకు జిల్లా మెగాఫ్యామిలీ సేవా సంఘం అధ్యక్షులు రాంకి ఆధ్వర్యములో " చిరంజీవిగారి జీవిత చరిత్ర పుస్తకం " ఆవిష్కరణ స్థానిక బేరిచావిడి వీధిలో చిరంజీవి సేవా సంఘం కార్యాలయంలో జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా మెగాఫ్యామిలీ సంఘం గౌరవ అధ్యక్షులు ఒమ్మి శ్రీనుగారితో పుస్తకం ఆవిష్కరణ జరిపితిమి. ఆయన మాట్లాడుతూ చిరంజీవిగారి జీవిత చరిత్ర పుస్తకం అవిష్కరణ చేయడం ఎంతో ఆనందంగా వున్నది అని అన్నారు. ఈ కార్యక్రమానికి మెగా అభిమానులు చంటి, రంగ, గెంజిపేట శ్రీను, ఏసు, సంతోష్, క్రిష్ణ, గణేష్, బాబా శ్రీను, పైడిరాజు, రమేష్‌లు పాల్గొన్నారు.



శ్రీ అదిభట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అదిభట్ల మనవడు అనంద్ నారాయణ చేపడుతున్న మట్టివిగ్రహాలు పంపిణీ లో నేను పాల్గొన్నాను నాతోపాటుగా సీనియర్ న్యాయవాది,ప్రముఖ రచయిత,జనహితం కోరే నాలుగేస్సల రాజుగారు,బీజేపీ నేత శివారెడ్డి,సర్వేశ్వరావు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

– వార్తావళి, విజయనగరం

## ప్రభుత్వ భవన నిర్మాణాల పురోగతిపై జె.సి. వెంకటరావు ఆరా

### డెంకాడ, పూసపాటిరేగ మండలాల్లో పరిశీలన

**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 21:** జిల్లాలోని వివిధ మండలాల్లో నిర్మాణంలో వున్న ప్రభుత్వ భవనాల నిర్మాణాలను జాయింట్ కలెక్టర్(ఆసరా, సంక్షేమం) జె.వెంకటరావు శుక్రవారం పరిశీలించారు. డెంకాడ, పూసపాటిరేగ మండలాల్లో ఆయన పర్యటించారు. డెంకాడ మండలంలో పినతాడివాడ, పెదతాడివాడ, గుణుపూరుపేట గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్ నెస్ కేంద్రాలను జె.సి. పరిశీలించారు. వాటి పురోగతిని తెలుసుకొని ఎప్పటిలోగా పూర్తవుతాయనే విషయాన్ని ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం పూసపాటిరేగ మండలం కొల్లాయవలసలో రైతుభరోసా కేంద్రాన్ని, గ్రామ సచివాలయాన్ని, వెల్ నెస్ కేంద్ర నిర్మాణాన్ని పరిశీలించారు.



### బ్యాంకు ఖాతాలు సరిచేసుకొని

## బీమా పరిహా౦ పొందండి

**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 21:** జిల్లాలో 2016, 2017 సంవత్సరాలకు సంబంధించి పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం 614 మంది రైతుల ఖాతాల్లో జమ కాలేదని, ఈ జాబితా ఆయా మండలాల్లోని వ్యవసాయ సహాయకులకు అందజేశామని, బీమా పరిహారం అందని ఆయా రైతులంతా తమ గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి తమ బ్యాంకు ఖాతాల నెంబర్లు సరిచేసుకొని పంటల బీమా పొందాలని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు ఎం.ఆశాదేవి తెలిపారు. రెండు రోజుల్లోగా రైతుల బ్యాంకు ఖాతాలు సరిచేసి అందజేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించామని, అందువల్ల ఆయా సంవత్సరాల్లో పంటల బీమా పరిహారం పొందలేకపోయిన, తమ ఖాతాల్లో డబ్బు జమకాని రైతులు వెంటనే తమ గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో వుండే వ్యవసాయ సహాయకుల్ని సంప్రదించాలన్నారు. జి.ఐ.సి., ఐసిఐసిఐ–లాంబార్డు కంపెనీల ద్వారా ఈ పరిహారం మంజూరు కావలసి వుందన్నారు. జిల్లాలో 2016 సంవత్సరానికి సంబంధించి 5 మండలాల( దత్తిరాజేరు, వేపాడ, ఎల్.కోట, గంట్యాడ, విజయనగరం)కు చెందిన 33 మంది రైతులకు రూ.3.39 లక్షలు, 2017 సంవత్సరానికి సంబంధించి 12 (బలిజిపేట, భోగాపురం, బొబ్బిలి, గంట్యాడ,డెంకాడ, జామి, కొమరాడ, కొత్తవలస, కురుపాం, ఎల్.కోట, పార్వతీపురం, సీతానగరం)మండలాలకు సంబంధించిన 581 మంది రైతులకు రూ.59.09 లక్షలు చెల్లించాల్సి వుందన్నారు.

# అవినీతికి సహకరిస్తున్న అధికారులను బదిలీతో సరి పెట్టేస్తారా?



**అనకాపల్లి, వార్తావళి, ఆగస్ట్ 21:** ప్రజా సంఘాల ప్రతినిధులు, ఆర్ డి ఓ. కార్యాలయంలో ఆర్ డి ఓ సీతారామారావు గారిని కలిసి, జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది అక్రమ మైనింగ్ క్వారీలపై విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు నిర్వహించి భారీ స్థాయిలో అక్రమాలు జరిగినట్టు నిర్ధారించి 113. 30 కోట్ల రూపాయల భారీ అపరాధ రుసుము విధించిన సంగతి తెలిసిందే, ఇంత పెద్ద మొత్తంలో సర్కారు ఆదాయానికి గండి పడుతున్న స్థానిక గనుల శాఖ అధికారులు గుర్తించకపోవడం దారుణమని, అనకాపల్లి మండలం సీతానగరం రెవెన్యూ పరిధిలో వెంగమాంబ క్రషర్ కు చెందిన నాలుగు రాతి క్వారీలపై గత నెల ఏడో తారీఖున విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు చేసి ,పరిమితికి మించి తవ్వకాలు జరుగుతున్నాయి అని గుర్తించారు, అనుమతులు ఒకచోట తీసుకొని తవ్వకాలు మరొకచోట చేసినట్టుగా నిర్ధారించారు, అన్నింటా నిబంధనలను ఉల్లంఘించినందుకు 32. 36కోట్ల అపరాధి రుసుం విధించారు ,ఈ క్వారీలు అనకాపల్లి గనుల శాఖ కార్యాలయానికి దగ్గర్లోనే ఉన్నాయి ,అయినా ఏనాడు మైనింగ్ ఎ డి ఆ క్వారీలను పరిశీలించింది లేదు ,అక్రమాలను గుర్తించింది లేదు, అంతేకాకుండా విజిలెన్స్ అధికారులు అక్రమాలు గుర్తించి పెనాల్టీ విధించిన తరువాత నెలరోజులు నిర్భయంగా శ్రీనివాస్ చౌదరి అక్రమ మైనింగ్ పాల్పడుతూనే ఉన్నాడు ,అయినా మైనింగ్ ఎ డి అటు వైపు తలెత్తి చూసిన పాపాన పోలేదు, ఇంత దారుణం జరుగుతున్నా సంబంధిత అధికారి నిమ్మకు నీరెత్తినట్టు ఎందుకు ఉండిపోయాడొ అందరికీ అర్థం అవుతుందని, అవినీతికి సహకరిస్తున్న అధికారిని బదిలీ చేసినంత మాత్రాన సమస్య తీరిపోదు అని ,ఎక్కడికి వెళ్ళినా ఇలా అవినీతి కి అండగా ఉంటాడు కాబట్టి ఇటువంటి అధికారి పై సమగ్ర దర్యాప్తు జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలె తప్ప బదిలీ చేసి చేతులు దులుపుకోవడ సరికాదని, ఇంత భారీ ఎత్తున అక్రమ మైనింగ్ పాల్పడుతున్న శ్రీనివాస్ చౌదరిని కస్టడీలోకి తీసుకోవాలని, పొట్టకూటి కోసం చిన్న చిన్న తప్పులను చేసే వారిని కఠినంగా శిక్షించే చట్టాలు, కోట్ల ,కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే అవినీతిపరులకు, వారికి అండగా ఉండే అధికారులను కఠినంగా శిక్షించకపోతే జిల్లా యంత్రాంగమంతా అవినీతిని ప్రోత్సహిస్తున్నట్లు అవుతుందని ,దీనిపై సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజా సంఘాల ప్రతినిధులు కోరుతున్నామని అన్నారు ,లేనియెడల ఈ సమస్యను ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్తామని తెలియజేస్తూ ,ఆర్ డి ఓ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో, నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ బొడ్డేడ అప్పారావు, ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్నియాదవ్ , దళిత సంఘం నాయకులు మట్టా కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# కరోనాను జయించి విధులకు హాజరవుతున్న పోలీసు సిబ్బందికి స్వాగతం

### విజయనగరం రూరల్ సి.ఐ టి.ఎస్.మంగవేణి



**ఎస్‌కోట, వార్తావళి, ఆగస్ట్ 21:** విజయనగరం జిల్లా పోలీసుశాఖ, విజయనగరం రూరల్ పోలీసు స్టేషనులో పని చేస్తున్న ఐదుగురు హెచ్.సిలు ఇద్దరు కానిస్టేబుళ్ళు మొత్తం ఎడుగురు పోలీసు ఉద్యోగులు కరోనా చికిత్స పొంది, కరోనాను జయించి, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజలకు సేవ చేసేందుకు తిరిగి విధులకు పునరంకితం అవుతున్న పోలీసు సిబ్బందికి విజయనగరం రూరల్ సి.ఐ శ్రీమతి టి.ఎస్.మంగవేణి, ట్రైనీ డిఎస్పీ జెస్సీ ప్రశాంతి, విజయనగరం రూరల్ ఎస్.ఐ కృష్ణవర్మ మరియు రూరల్ పోలీసు సిబ్బంది విజయనగరం రూరల్ సర్కిల్ కార్యాలయం వద్ద స్వాగతం పలికి, వారిని సాదరంగా విధులకు ఆహ్వానించారు. ట్రైనీ డిఎస్పీ జెస్సీ ప్రశాంతి మరియు రూరల్ సి.ఐ టి.ఎస్.మంగవేణి మాట్లాడుతూ-ప్రజా రక్షణలోముందు వరుసలో నిలబడి ప్రజలకు, కరోనాకు మధ్య అడ్డుగా నిలిచి,అనారోగ్యం పాలై, కరోనాతో పోరాడి, జయించి, తిరిగి విధులకు పునరంకితం అవుతున్న పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీమతి బి.రాజకుమారి ఆదేశాలతో కరోనా బారిన పడిన పోలీసు సిబ్బంది, అధికారులలో మనోధైర్యం నింపి, వారిని మానసికంగా బలవంతులను చేసామని, తద్వారా వారంతా త్వరితగతిన కరోనాను జయించి, తిరిగి విధులకు పునరంకితులు అవుతున్నా రన్నారు. కరోనా నుండి కోలుకున్న సిబ్బంది, అధికారులు తమ ఆరోగ్యం పట్ల మరికొన్ని రోజులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, బలమైన ఆహారాన్ని తీసుకోవాల్సిందిగా సూచించారు.

# కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తా

### ప్రొఫెసర్ ఆర్.ఎస్.సర్రాజు

**సాలూరు, వార్తావళి, ఆగస్ట్ 21:** గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో అభివృధి కార్యక్రమాలు అమలు చేస్తూ గిరిజనుల అభివృద్ధికి ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టి చేయూత నిస్తుంది. గిరిజన విశ్వ విద్యాలయానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తా అని కేంద్ర బృందం సభ్యులు ప్రొఫెసర్ అర్.ఎస్. సర్రాజు పేర్కొన్నారు.కేంద్ర బృందం సభ్యులు ప్రొఫెసర్ తన పర్యటనలో భాగంగా శుక్రవారం సాలూరు మండలం కొట్టకీ గ్రామంలో గిరిజన విశ్వ విద్యాలయం నిర్మాణానికి సంబంధించి న స్థలం వివరాలు అడుగగా సాలూరు శాసన సభ్యులు పిడిక రాజన్న దొర, బొబ్బిలి శాసన సభ్యులు శంబంగి వెంకట చిన్నప్పల నాయుడు, ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి అర్.కూర్మనాథ్, పార్వతీపురం సబ్ కలెక్టర్ విదె ఖర్ గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి సంబందించిన రేఖా చిత్రాలు చూపిస్తూ వివరించారు.ఈ సందర్భంగా సాలూరు, బొబ్బిలి శాసన సభ్యులు మాట్లాడుతూ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఎంత స్థలం కావాలన్న ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు, ఈ ప్రాంతంలోశ్రేయస్కరం గిరిజన విశ్వవిద్యాలయం వస్తె గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి కలుగుతుందని అలాగే గిరిజనేతరులకు అన్నివిధాలా లాభం చేకూరుతుందని, జాతీయ రహదారికి అతిసమీపంలో, రైల్వే స్టేషన్ దగ్గర అలాగే భోగాపురం విమానాశ్రయానికి దగ్గరగా వుంటుందని వివరించారు.

# సచివాలయాల్లో 1187 ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు

**అరసవల్లి, వార్తావళి, ఆగస్ట్ 21:** నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కానుకను అందించనుంది. గతేడాది అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చీ రాగానే సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి.. భారీగా నియామకాలు చేపట్టి రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జిల్లాలో కూడా గ్రామ, వార్డు సచివాలయాల్లో వేలాదిమంది నిరుద్యోగులను ఎలాంటి ప్రలోభాలకు తావివ్వకుండా నియమించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల అమలు, పరిపాలన వికేంద్రీకరణలో సచివాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వివిధ కారణాలతో ఇంకా ఖాళీగా ఉన్న సచివాలయాల ఉద్యోగాలను యుద్ధప్రాతిపదికన భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు దిగింది. ఈమేరకు అదనపు నోటిఫికేషన్‌ను ఈ ఏడాది జనవరిలో సంక్రాంతి కానుకగా నిరుద్యోగుల కోసం విడుదల చేసిన సంగతి తెలిసిందే. అనంతరం పరీక్షలకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేస్తున్న క్రమంలో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడం, ఆ తర్వాత కరోనా వ్యాప్తి కారణంగా ఎన్నికల వాయిదాతోపాటు సచివాలయాల ఉద్యోగుల భర్తీ ప్రక్రియ కూడా నిలిచిపోయింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూనే సచివాలయాల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలో వచ్చే నెల మూడో వారంలో అర్హత రాత పరీక్షలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది.

**జిల్లాలో 1187 పోస్టుల భర్తీ**

కలెక్టర్ జె.నివాస్ ఆధ్వర్యంలో జెడ్పీ సీఈవో జి.చక్రధరరావు, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ ఈ నియామకాలకు చేపట్టనున్నారు. జిల్లాలో మొత్తం 835 గ్రామ సచివాలయాలు, 95 వార్డు సచివాలయాలుండగా, వీటిల్లో 19 విభాగాల్లో 7884 పోస్టులను గుర్తించారు. గతేడాది 6697 పోస్టులను భర్తీ చేయగా, వివిధ కారణాలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం పలు పోస్టులు ఖాళీగా ఉండిపోయాయి. ఇలా ఖాళీగా ఉన్న 1187 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా సుమారు 70 వేలమంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 48,756 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించారు. వీరికే హాల్‌టిక్కెట్లు పంపిణీ చేయనున్నారు.

**సెప్టెంబర్ 20 నుంచి రాత పరీక్షలు**

గ్రామ/వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలకు వచ్చే నెల 20 నుంచి ఓ వారం రోజులపాటు రాతపరీక్షలను నిర్వహించేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తాజాగా నిర్ణయించింది. జిల్లాలో 19 విభాగాల్లో 1187 పోస్టులను భర్తీ చేసే క్రమంలో పరీక్షలను విభాగాల వారీగానే నిర్వహించనున్నారు. కోవిడ్ నిబంధనలు పూర్తిగా పాటిస్తూ.. పరీక్ష కేంద్రాలను ఎంపిక చేయనున్నారు. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేందుకు కేంద్రాల వద్ద వీడియో రికార్డింగ్ చేయాలని, అలాగే ప్రతి పరీక్ష కేంద్రాన్ని శానిటైజ్ స్ప్రే చేయాలని, థర్మల్ స్కానింగ్ అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు.

**కోవిడ్ నిబంధనలను పాటిస్తూ పరీక్షల నిర్వహణ**

రెండో విడత సచివాలయాల్లో పోస్టుల భర్తీకి సర్వం సిద్ధం చేస్తున్నాం. కోవిడ్ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని అవసరమైనన్ని పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. తొలి విడత కంటే అభ్యర్థులు తగ్గినప్పటికీ వైరస్ ప్రభావం పడకుండా పరీక్ష కేంద్రాలను ఎక్కువగానే ఏర్పాటు చేస్తామన్నారు.

# విశాఖపట్నం

## 200 సిలిండర్లతో ఆక్సిజన్ సరఫరా



**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, ఆగస్ట్ 21:** కేజీహెచ్ సీఎస్ఆర్ బ్లాక్‌లో సిద్ధమవుతున్న కొవిడ్ ఆసుపత్రికి అవసరమైన ఆక్సిజన్ సరఫరా విషయంలో నెలకొన్న సమస్య కొలిక్కి వచ్చింది. కొవిడ్ వార్డులో కీలకమైన ఆక్సిజన్ సరఫరాకు సంబంధించిన పనులు ఇప్పటివరకు పూర్తి కాకపోవడంతో ఆసుపత్రి ప్రారంభం ఆలస్యమవుతోంది. ఆక్సిజన్ సరఫరా చేయాల్సిన సంస్థ ప్రతినిధులతో గురువారం ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ పి.వి.సుధాకర్ చర్చించారు. సీఎస్ఆర్ బ్లాక్‌లో 500 పడకలకు ఆక్సిజన్ సరఫరా అయ్యేలా కేంద్రీకృత వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఆయా పడకలకు నేరుగా ఆక్సిజన్ సరఫరా చేసేలా ట్యాంకర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే ఇంకా ట్యాంకర్‌ని సిద్ధం చేయలేదు. అది అందుబాటులోకి వచ్చే వరకు... 200 సిలిండర్లతో ఆక్సిజన్ సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి... ఆసుపత్రిని ప్రారంభిస్తామని డాక్టర్ సుధాకర్ తెలిపారు.

## ఎంపీ మోపిదేవి వాహనానికి ప్రమాదం



**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, ఆగస్ట్ 21:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. అయితే ఎంపీ మోపిదేవితో పాటు ఆయన కుటుంబసభ్యులకు తృటిలో ప్రమాదం తప్పింది. విశాఖ జిల్లా కసింకోట మండలం తాళ్లపాలెం వద్ద మోపిదేవి వెళ్తున్న కాన్వాయ్‌లో ముందు వెళ్తున్న వాహనం సడన్ బ్రేక్ వేయడంతో కార్లు ఢీకొన్నాయి. అదే సమయంలో వెనకనే వచ్చిన డిప్యూటీ సీఎం పుష్పశ్రీ వాణి వాహనంలో ఎంపీ మోపిదేవి, ఆయన కుటుంబసభ్యులు విశాఖ బయల్దేరి వెళ్లారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# విశాఖ అందానికి .. స్వచ్ఛ చందనం

**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, ఆగస్ట్ 21:** స్వచ్ఛసర్వేక్షణ్-2020లో విశాఖ నగరం మెరుగుపడింది. గతేడాదితో పోల్చితే ర్యాంకులో పుంజుకొంది. 23వ ర్యాంకు నుంచి 9వ ర్యాంకుకు చేరింది. 10 లక్షల జనాభా కన్నా ఎక్కువ ఉన్న నగరాలతో విశాఖ పోటీ పడి ఈ ర్యాంకు సాధించింది. ఇందులో దేశ వ్యాప్తంగా మొత్తం 47 నగరాలు పోటీపడ్డాయి. లక్షకు పైగా జనాభా ఉన్న మరో కేటగిరీ నగరాల్లో టాప్-25లో విశాఖ 17వ ర్యాంకు సాధించింది. ఈ ర్యాంకుల కోసం గతేడాది ఏప్రిల్ నుంచి కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరాల సేకరణ ప్రారంభించింది. ఈ ఏడాది జనవరిలో దిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం విశాఖ నగరంలో పర్యటించింది. నగరంలోని పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర వనరుల్ని పరిశీలించింది. ఈ నేపథ్యంలో ప్రజలతో మాట్లాడి వివరాలు తీసుకుంది. ఈ బృందం ప్రత్యక్ష పరిశీలన కేటగిరీలో 97.93 శాతం మార్కులు పొందడం గమనార్హం. అధికార యంత్రాంగం, సిబ్బంది పనితీరు, ప్రజల సహకారం నగరంలో బాగున్నట్లు గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పలు కేటగిరీల అవార్డుల్లో దేనిలోనూ విశాఖకు అవార్డులు దక్కకపోవడం నిరాశకు గురిచేసింది. దక్షిణ భారతదేశ జోన్ స్థాయిలోనూ ఏ అవార్డూ రాలేదు.



### తగ్గిన జనాదరణ..

గతసారితో పోల్చితే ఈసారి ప్రజల భాగస్వామ్యం ఆశించిన స్థాయిలో లేదనే చెప్పాలి. ఈ ఏడాది స్వచ్ఛసర్వేక్షన్‌లో నగర వ్యాప్తంగా మొత్తం 4,03,067 మంది భాగస్వాముల య్యారు. గతేడాది పోటీల్లో ప్రజల అభిప్రాయసేకరణ, వారి భాగస్వామ్యంలో 82.96 శాతం మార్కులొచ్చాయి. ఈసారి 77.38 శాతం మార్కులే నగరం సొంతం చేసుకుంది. ఈ కేటగిరీపై జీవీఎంసీ కూడా నిరాశ వ్యక్తపరిచింది. ? కమిషనర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ.. స్వచ్ఛతా యాప్ మరో 300 మంది డౌన్లోడ్ చేసుకుని ఉంటే ర్యాంకు మరింత మెరుగయ్యేది అని వ్యాఖ్యానించారు.

### ఇప్పుడు.. త్రీస్టార్!

బహిరంగ మలమూత్రవిసర్జన నియంత్రణలో నగరం ముందడుగేస్తోందని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది. నగరఖ్యాతిని పెంచేలా 'ఓడీసీంం' ధ్రువీకరణను ఇచ్చింది. ప్రత్యేకంగా క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒక బృందం నగరంలో పర్యటించిన తర్వాత ఈ హోదాని కేటాయించారు. మరోవైపు చెత్త నిర్వహణ, నియంత్రణలో భాగంగా గార్బేజ్ ఫ్రీ సిటీ కేటగిరీలో గతంలో వన్‌స్టార్ ధ్రువీకరణని మాత్రమే కేంద్రం ఇచ్చింది. బృంద పరిశీలనలలో లోపాలున్నాయని జీవీఎంసీ ఫిర్యాదు చేయడం, ఆ తర్వాత మరో బృందం వచ్చి పరిశీలనలు చేయడం జరిగాయి. ఈ నేపథ్యంలో ఇటీవల నగరానికి 'త్రీస్టార్' రేటింగ్ ఇచ్చారు. నగర ర్యాంకింగ్ గతేడాదితో పోల్చితే ఇక్కడ మెరుగయింది.

నగరంలో మొత్తం 25 అంశాల్లో పరిశీలనలు జరిగిన తర్వాత 'త్రీస్టార్' కేటాయించారు. జాతీయస్థాయి నగరాలు 7స్టార్ రేటింగ్ పొందేలా చెత్త నిర్వహణ, నియంత్రణను కలిగి ఉండాలని కేంద్రం సూచించింది. ఈ ప్రమాణాన్ని అందుకోవాలంటే.. నగరం ఎన్నో సవాళ్లను దాటాల్సి ఉంది.

# వెదురు కంజి టేస్టే వేరబ్బా.!

**ముంచంగిపుట్టు(అరకు), వార్తావళి, ఆగస్ట్ 21:** కూరగాయల్లో ఎన్నో రకాలుంటాయి. కానీ మన్యంలో లభించే వెదురు నుంచి తీసిన చిగురు కూర రుచి వేరు అంటున్నారు గిరిజనులు. దీనిని వెదురు కొమ్ములు, వెదురు కంజి అని కూడా పిలుస్తారు. వెదురు కంజి కూర వాహ్వా.. అంటూ లొట్టలేసుకుంటున్నారు. ప్రస్తుతం మన్యంలోని మండల కేంద్రాల్లో హాట్ కేకుల్లా వెదురు కంజి అమ్మకాలు జరుగుతున్నాయి. అటవీ కొండ ప్రాంతాల్లో ఉన్న వెదురు బొంగు నుంచి లేత వెదురును తీసి చిగురును సేకరిస్తారు. దానిని శుభ్ర పరిచి ముక్కలుగా చేస్తారు. వాటిని గిరిజనులు మండల కేంద్రాలకు తెచ్చి వాటాల రూపంలో రూ.20 నుంచి రూ.40 లు వరకు విక్రయిస్తారు.



**వెదురు కంజిల వాటా రూ.20, అమ్మకానికి సిద్ధంగా వెదురు కంజి**

వెదురు కంజిని రెండు రకాలుగా కూర తయారీకి వినియోగిస్తారు. పచ్చి వెదురు కంజిని ఓ రకంగా, ఎండబెట్టి మరో విధంగా కూర తయారీకి వాడతారు. పచ్చిగా ఉన్నప్పుడు అప్పటికప్పుడు కూర తయారు చేసుకోవాలి. ఎండబెడితే ఏడాది కాలంలో ఎప్పుడైనా కూర వండుకోవచ్చు. వేపుడు, పచ్చడి, పులుసు వంటి రకాలుగా కూరను తయారు చేసుకుని చాలా ఇష్టంగా తింటారు. ముఖ్యంగా కూర తయారు చేసే ముందు రెండు మూడు సార్లు వెదురు కంజిని బాగా కడగాలి. అప్పుడే వెదురు కంజిలో ఉండే చేదు పోతుంది. వెదురుకంజిని బాగా ఉడకబెట్టి దాని కషయాన్ని తాగితే శరీరానికి మంచి చలువ చేస్తుందని గిరిజనులు చెబుతున్నారు. మధుమేహం, కపం, మూల వ్యాధి నివారణకు ఆయుర్వేదపరంగా ఎంతో ఉపశమనం ఇస్తుంది. కడుపులో నులి పురుగును తొలగిస్తుంది. గాయం మానేందుకు వెదురు కంజిని పేస్ట్‌గా చేసి గాయంపై రాస్తారు.మారుమూల గిరిజనులు పాము, తేలు కాటుకు ఔషధంగా సైతం దీనిని వినియోగిస్తున్నారు.

# జాప్ ఆధ్వర్యంలో వినాయక ప్రతిమల పంపిణీ

**విశాఖపట్నం, ఉత్తరం, వార్తావళి, ఆగష్టు 21:** కరోనా మహమ్మారి వీరవిహారం చేస్తున్న తరుణంలో పాత్రికేయమిత్రులందరు తగిన జాగ్రత్తలు తీసుకొని వినాయక చవితి వేడుకను జరుపుకోవాలని జర్నలిస్ట్ అసోసియేషన్ అఫ్ ఆంధ్రప్రదేశ్(జాప్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేఏఆర్ పాత్రుడు పిలుపునిచ్చారు.ఈ రోజు జాప్ విశాఖపట్నం యూనిట్ ఆధ్వర్యంలో పాత్రికేయులకు మట్టి వినాయక ప్రతిమలను అందచేసారు.ఈ సందర్భంగా పాత్రుడు మాట్లాడుతూ వార్తలకోసం ఎంతో రిస్కు తీసుకుని విధులు నిర్వహిస్తున్నామని,ప్రభుత్వం పాత్రికేయులకు తగిన ఆరోగ్య,ఆర్థిక భద్రత కల్పించాలని కోరారు.ఎన్ యూ జె ఉపాధ్యక్షుడు ఎన్.నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో ఎప్పటికప్పుడు తాజాసమాచారాన్ని ప్రజలకు తెలియచేసేది పాత్రికేయులేనని కొనియాడారు.జాప్ విశాఖపట్నం అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి పండుగను ఎంతో ఉత్సాహంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు.జాప్ ఉత్తరాంధ్ర ఇంచార్జి బి ఎస్ ఎస్ శశి మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలగనివిధంగా వినాయకచవితి పండుగను చేసుకోవాలని కోరారు.జాప్ విశాఖపట్నం ఉపాధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ స్వాతి ప్రమోటర్స్ సహకారంతో సభ్యులందరికీ ప్రతిమలను అందచేసినట్లు చెప్పారు.స్వాతిప్రమోటర్స్ అధినేత కృష్ణారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.మరో ఉపాధ్యక్షుడు కేఎమ్ కీర్తన్ మాట్లాడుతూ కొవిడ్ నిభందనలుసరించి పూజలు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ జగన్మోహన్,ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మదన్ కింతాడ పాల్గొన్నారు.




# డబ్బుతో ఉడాయించిన నిందితుల ఛాయాచిత్రాలు విడుదల

**ఎం.వి.పి.కాలనీ, ఎండాడ, వార్తావళి, ఆగస్ట్ 21:** పి.ఎం.పాలెం పోలీసుస్టేషన్ పరిధిలో తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని చెప్పి నగదు దోచుకున్న ఇద్దరు వ్యక్తుల చిత్రాలను పి.ఎం.పాలెం పోలీసులు గురువారం విడుదల చేశారు. నేర విభాగపు సి.ఐ. రామచంద్రరాజు, ఎస్.ఐ. అప్పారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన కోటేశ్వరరావుకు మంగళవారం కొంతమంది వ్యక్తులు ఫోన్ చేసి తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని.. పి.ఎం.పాలెం క్రికెట్ స్టేడియం వద్దకు రావాలని సూచించారు. దీంతో ఆయన మరో వ్యక్తితో కలిసి సుమారు రూ.20 లక్షలు పట్టుకుని స్టేడియం వద్దకు వచ్చారు. ఆలోగా ఇద్దరు వ్యక్తులు ఓ వాహనంలో స్టేడియం వద్దకు వచ్చారు. కోటేశ్వరరావుతో మాటలు కలిపారు. ముందుగా వేసిన ప్రణాళికలో భాగంగా నకిలీ పోలీసు సైరన్ మోగించటంతో కోటేశ్వరరావు ఒక్కసారిగా కంగారుపడగా.. ఇదే అదనుగా కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు అతని వద్ద ఉన్న రూ.20 లక్షల బ్యాగ్‌ను లాక్కొని పారిపోయారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా ఆ సమయంలో సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి, వారి ఛాయాచిత్రాలను పోలీసులు విడుదల చేశారు. ఈ నిందితుల వివరాలను ఎవరికైనా తెలిస్తే 9490662712, 9440904314 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.



# దివ్యాంగులకు రేషన్ కిట్స్ అందజేత

**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, ఆగస్ట్ 21:** రోటరీ క్లబ్ విశాఖ సెంటెనియిల్ ప్రెసిడెంట్ దొరబాబు గారు ఈరోజు రావికమతం భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ సెంటెనియిల్ ప్రెసిడెంట్ దొరబాబు గారు మాట్లాడుతూ రావికమతం భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఇక్కడ ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాధ నాయుడులు విశాఖపట్నం చెందిన ది ఎబిలిటీ పీపుల్ ఆర్గనైజేషన్ సంస్థ ద్వారా సంయుక్తంగా దివ్యాంగులకు మంచి సేవా కార్యక్రమాలు అందించడంతో పాటు వారికి అవసరమైన ఉపకరణాలు కూడా సమకూర్చి దివ్యాంగుల అభ్యున్నతికి తోడ్పడుతున్నారు అని అన్నారు. అలాగే మండలంలో గల దివ్యాంగులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని దొర బాబు గారు అన్నారు. రోటరీ క్లబ్ విశాఖ సెంటెనియల్ నుండి లాజిస్టిక్ మద్దతుతో యుఎస్ఎలోని జివ్ దయా ఫౌండేషన్ (జెడిఎఫ్) సహకారంతో ది ఎబిలిటీ పీపుల్ (టిఎపి), ఆంధ్ర ప్రదేశ్ సమగ్ర శిక్ష వారు సంయుక్తంగా రావికమతం మండలంలోని 133 దివ్యాంగుల కుటుంబాలకు విశాఖపట్నం జిల్లాలో డ్రై రేషన్ కిట్స్ 14 రకాల నిత్యావసర వస్తువులు (10 కేజిల బియ్యం, 5కేజి ల గోధుమపిండి, 1కేజి కందిపప్పు, 1కేజి శనగపప్పు, 1కేజికేజి ఆయిల్, 1కేజి పంచదార, మిర్చి 100 గ్రాములు, 100 గ్రాములు ల జీలకర్ర, 100 గ్రాముల ఆవాలు, 50 గ్రాముల మసాల, సాల్ట్ 1కేజి, 250 గ్రాముల వేరుశనగ, 250 గ్రాముల సెనగలను పంపిణీ చేయగా వాటిని విశాఖపట్నం రోటరీ క్లబ్ సెంటెనియల్ ప్రెసిడెంట్ దొరబాబు గారు, మేడివాడ జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి జయలక్ష్మి గారు,ది ఎబిలిటీ పీపుల్ (టిఎపి) ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు ఊర్వశి, చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. అలాగే విశాఖపట్నం, దాబాగార్డెన్స్ ది ఎబిలిటీ పీపుల్ డైరెక్టర్ దిలీప్ కుమార్ పాత్రో సౌజన్యంతో, జీవ దయ పాండేషన్ మరియు రోటరీ క్లబ్ వారి సహాయంతో రావికమతం మండలాల్లో 133 మంది శారీరక దివ్యాంగులకు మరియు మానసిక దివ్యాంగులకు ఉచిత నిత్యావసర వస్తువులతో పాటు చెక్క కుర్చీలను, కాలిపేర్స్ మరియు పోలియో ,ఇతర దివ్యాంగులకు చెంక కర్రలు, దివ్యాంగులకు ది ఎబిలిటీ స్వచ్ఛంద సంస్థ వారు కృత్రిమ అవయవాలను ఉచిత పంపిణీ చెయ్యడానికి స్క్రీనింగ్ కాంప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశాఖ సెంటెనియల్ రోటరీ క్లబ్ సభ్యులు విద్యాసాగర్ గారు ది పీపుల్ సంస్థ సభ్యులు ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాధ నాయుడు, మహాలక్ష్మి నాయుడు మరియు దివ్యాంగులు పాల్గొన్నారు.




# ఖాళీ ఇంట్లో వ్యక్తి మృతదేహం

**గురుద్వారా, వార్తావళి, ఆగస్ట్ 21:** గురుద్వారా దరి బాలయ్యశాస్త్రి లేఅవుట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. నాలుగోపట్టణ పోలీసుల కథనం మేరకు.. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన రోహిత్ ఈ ఏడాది మార్చిలో ఇంటిని కొన్నాడు. అప్పటి నుంచి ఇల్లు ఖాళీగా ఉండటంతో 'టులెట్ బోర్డు' పెట్టమని మధ్యవర్తి అజయ్‌కుమార్‌కు రోహిత్ సూచించాడు. గురువారం ఉదయం అజయ్‌కుమార్ ఇంటి తలుపులు తీసి లోపలకు వెళ్లి చూడగా ఉరేసుకొని ఉన్న వ్యక్తి మృతదేహం కనిపించింది. అతను వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఏసీపీ కులశేఖర్, సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని వయసు 40 నుంచి 45 ఏళ్ల మధ్యలో ఉంటుందని, మృతదేహం పూర్తిగా కుళ్లిపో వడంతో వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం వెనుక గణేశ్‌నగర్‌లో ఉన్న వినాయకుడి ఆలయ కార్యాలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. నాలుగోపట్టణ క్రైం ఎస్ఐ నర్సింగరావు కథనం మేరకు.. గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయంలోకి ప్రవేశించి బీరువాల తలుపులు పగులగొట్టారు. అందులో ఉన్న రెండు తులాల బంగారం, రెండు కేజీల వెండి ఆభరణాలను అపహరించారు. ఉదయం ఆలయ గ్రామ కమిటీ సభ్యులు చూసేసరికి తలుపులు పగులగొట్టి ఉండటంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. క్రైం ఏసీపీ శ్రావణ్‌కుమార్, తూర్పు సబ్‌డివిజన్ సీఐ సింహాద్రినాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీస్ జాగిలాలు, క్లూస్ బృందాల్ని రంగంలోకి దింపి వేలిముద్రలను సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గణేష్ 1000 క్లే విగ్రహాలను మొక్కల విత్తనంతో పంపిణీ

**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, ఆగస్ట్ 21:** ఈ సందర్భముగా క్లబ్ అధ్యక్షులు కెప్టెన్ కాళి ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణం కూడా రోటరీపై దృష్టి సారించే ప్రాంతమని, క్లే గణేష్‌ను ఎటువంటి కృత్రిమ రంగులు లేకుండా పంపిణీ చేయడం ద్వారా మేము మా వంతు పాత్ర పోషిస్తున్నామని చెప్పారు.ప్రాజెక్ట్ డైరెక్టర్ రాంబాబు మాట్లాడుతూ, పూజలు మరియు ఆచారాల తరువాత, విగ్రహాన్ని ఒక కుండలో ఉంచి, లోపల ఒక విత్తనం ఉన్నందున నీళ్ళు పెట్టడం ద్వారా మొక్కగా మార్చవచ్చని అన్నారు. భక్తులు ఈ పంపిణి కార్యక్రమాన్ని ప్రశంసించారు మరియు అలాంటి ఉద్యమంలో భాగం కావడం సంతోషంగా ఉందని అన్నారు. పంపిణీ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎలెక్ట్ రోటేరియన్ వర్మ, రోటరీ బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి రోటేరియన్ రాంబాబు, కార్యదర్శి రోటేరియన్ విఠల్ ప్రసాద్, రోటేరియన్ నరసింహం పాల్గొన్నారు.

**విలేకరులు కావలెను**

'వార్తావళి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు పశ్చిమగోదావరి, అనంతపురం జిల్లాల్లో జిల్లా ఇన్‌చార్జ్‌లుగా పనిచేయుటకు కమీషన్ పద్ధతిలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

**7032034001, 8500159006**




Printed, Published and Owned by B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh.
Editor B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh. Email : bulusu009@gmail.com, Cell : 8500159006